ONE click
ePaper
www.shanmukhavelugu.com

షణ్ముఖ
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 246

శుక్రవారం 18 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

వచ్చే ఎన్నికల్లోనూ కూటమిగానే పోటీ



క్రాస్ ఫైర్, మిస్ ఫైర్, విడాకులు ఉండవు

నెల్లూరు జిల్లా కోవూరులో కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేశ్

ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించిన మంత్రి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 17)

రానున్న 2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వంలోని పార్టీలు కలిసే పోటీచేస్తాయని..కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. క్రాస్ ఫైర్, మిస్ ఫైర్, విడాకులు ఉండవని.. పార్టీ అధినేతలుగా తమకు ఎలాంటి సందేహాలూ లేవని.. వస్తే తాను పవనన్నకు నేరుగా ఫోన్ చేస్తానని చెప్పారు. చిన్నచిన్న సమస్యలుంటే నేతలు మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరులో అద్భుతమైన నాయకత్వం ఉందని.. నియోజకవర్గాన్ని కంచుకోటగా తయారు చేయాలని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మనమే గెలవాలని పిలుపునిచ్చారు. బుధవారం మంత్రి నెల్లూరు నగరంతో పాటు, కోవూరులో పర్యటించారు. నెల్లూరు నగరంలో వీపీఆర్ ఫౌండేషన్, డీఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ నిధులతో ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించారు. తర్వాత ర్యాలీగా కోవూరు బైపాస్‌కు చేరుకుని ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. తర్వాత కోవూరు ఉషోదయ డెయిరీ పార్లర్ వద్ద తెదేపా కార్యకర్తలు, నేతలతో పార్టీ క్యాడర్ సమన్వయ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడారు.

కూటమి పార్టీలకు ఏకపక్ష విజయం రావాలి..

స్థానిక సంస్థలకు అక్టోబరు, నవంబరులో ఎన్నికలు జరుగుతాయని.. కూటమి పార్టీల అభ్యర్థులకు విజయం ఏకపక్షం కావాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. వైకాపా నాయకులు ఫస్ట్ గ్రేడ్ క్రిమినల్స్ అని.. రాజకీయం ముసుగులో కుల, మత విభేదాలు రెచ్చగొడతారని.. అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత కార్యకర్తలపై ▶2లో

అమెరికా నుంచి 100% టారిఫ్ ముప్పు..

భారత్ రియాక్షన్ ఇదే



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 17)

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల ఎగుమతులపై 100 శాతం టారిఫ్‌లకు వీలుకల్పించే బిల్లుకు అమెరికా చట్టసభల్లో ఆమోదం లభించింది. దీనిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేస్తే.. భారత్‌పై నూరుశాతం సుంకాలు పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ ఆంక్షల బిల్లును ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని వెల్లడించింది.“గతంలో చెప్పినట్టుగానే భారత్ తన 140 కోట్లమంది ప్రజలకు ఇంధన భద్రతను కల్పించడానికి కట్టుబడి ఉంది. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వేర్వేరు వనరుల నుంచి ఇంధన దిగుమతులను కొనసాగిస్తాం. రష్యాతో చమురు వాణిజ్యం అంశంపై అమెరికా ప్రతినిధులతో ▶2లో

కులం, బంధుత్వం.. ఉత్తరాంధ్ర వైసీపీకి శాపాలు!



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 17)

రాజకీయాల్లో నిలదొక్కుకోవాలంటే కులం, బంధుగణం బలంగా ఉండాలని చెబుతుంటారు. కానీ, ఉత్తరాంధ్రలో విపక్షం వైసీపీకి ఆ రెండు అంశాలే శాపాలుగా మారాయా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఉత్తరాంధ్ర రాజకీయాల్లో నెలకొంటున్న పరిస్థితులు గమనిస్తే విపక్షం వైసీపీలో నేతల బంధుప్రీతి, కుల రాజకీయాలు పార్టీని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఉందని అంటున్నారు. ఈ ప్రాంతంలో కీలక నాయకులుగా వ్యవహరిస్తున్న మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావులపై ఆ పార్టీకి చెందిన నాయకులు చేస్తున్న విమర్శలు వైసీపీలో అంతర్గత వ్యవహారాలను బయటపెట్టాయని చెబుతున్నారు. ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో బొత్స, ధర్మాన పెద్దరికమే ఎక్కువ. అటువంటి నేతలు కులం, బంధుప్రీతికి దాసోహం అయిపోతున్నారని పార్టీ నేతలు ఆరోపిస్తుండటం తీవ్ర సంచలనం సృష్టిస్తోందని అంటున్నారు.ఉత్తరాంధ్రకు చెందిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబంలో చెలరేగిన వివాదంతో విజయనగరం జిల్లాలో పార్టీ ఒక్కసారిగా కుదుపునకు గురైందని అంటున్నారు. ఈ వ్యవహారంపై చర్చ కొనసాగుతుండగానే శ్రీకాకుళం

రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం



రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన

ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్

రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 17)

ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం ▶2లో

దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతుందో ప్రధాని చూపించారు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 17)

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారబోతోందని.. దీన్ని ఎవరూ ఆపలేరని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వారణాసిలో నిర్వహించిన సేవా సంకల్ప్ అభియాన్‌లో ఆయన మాట్లాడారు. “దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రతి పేదవాడికి తాగునీరు అందించాలనేదే ప్రధాని లక్ష్యం. సుమారు 11 కోట్ల మంది పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. మధ్యవర్తులు లేకుండా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతున్నాయి.

కాశీ విశ్వనాథుడికి సీఎం చంద్రబాబు పూజలు

కొవిడ్ సంక్షోభంలోనూ ప్రధాని మోదీ మంచి పాలన అందించారు. ఆ సమయంలో 140 కోట్ల మందిని ఆయన కాపాడారు. ఉచితంగా దేశ ప్రజలకు కొవిడ్ వ్యాక్సిన్లు ▶2లో

గ్రామాల్లో రెండున్నరేళ్లలో 20,600 కి.మీ. రోడ్ల నిర్మాణం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 17)

గ్రామాల్లో రెండున్నరేళ్లలో 20,600 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడించారు. 10 వేల కి.మీ. తారు, మరో 9,600 కి.మీ. సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. గిరిజన గ్రామాలకు ఇంకో వెయ్యి కి.మీ.కు పైగా అడవి తల్లి బాట కింద రోడ్డు ▶2లో



అక్టోబర్ 17 వరకు ‘సేవా సంకల్ప్’ వైద్య శిబిరాలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 17)

ప్రధానమంత్రి మోదీ జన్మదినం సందర్భంగా గురువారం నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ‘సేవా సంకల్ప్’ పేరుతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అన్ని పీహెచ్‌సీల వద్ద ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు వైద్యసేవలు అందించడంతోపాటు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తామన్నారు. శిబిరాలకు హాజరయ్యే వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. ▶2లో

విశాఖ, రాజమండ్రి.. ఈ రెండు కార్పొరేషన్లపై బీజేపీ నజర్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 17)

ఏపీలో స్థానిక ఎన్నికలకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెలాఖరులో లేదా వచ్చేనెల ఆరంభంలో షెడ్యూల్ ప్రకటించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పొత్తులు, ఎత్తులపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. విపక్షం వైసీపీ యథావిధిగా ఒంటరి పోరుకు సిద్ధం అవుతుండగా, కూటమిలోని ▶2లో

పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు జగన్ పై అనిత ఫైర్

డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అనిత మండిపాటు

డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం

వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 17)

ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో ▶2లో

మొదటిపేజీ తరువాయి

వచ్చే ఎన్నికల్లోనూ కూటమిగానే పోట

ఉందన్నారు. తమకు వారి మాదిరిగా దొంగ పేపర్లు, టీవీ ఛానళ్లు లేవని.. కానీ కోటిమంది కార్యకర్తలు ఉన్నారని.. అంతా మాట్లాడితే వారు ఎన్నిరాసినా ప్రజలు నమ్మరని చెప్పారు. చేసిన మంచితో పాటు గొడ్డలి పార్టీ కుట్రలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత క్యాడర్‌పై ఉందన్నారు.

డీఎస్ఆర్ పాఠశాల ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థులతో మంత్రులు లోకేశ్, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, దాత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మంత్రి నారాయణ కుమార్తె షరణి తదితరులు

వేమిరెడ్డి దంపతులకు అభినందనలు..

కోవూరులో ఎన్టీఆర్ విగ్రహం లేని లోటు తీర్చిన వేమిరెడ్డి దంపతులకు అభినందనలు తెలిపారు. కోవూరు తెదేపా కంచుకోట అని ఇప్పటివరకు ఎనిమిది సార్లు గెలిచామన్నారు. డబ్బులు ఎంతోమంది సంపాదిస్తారని.. కానీ ప్రజల కోసం ఏదో చేయాలనే తపన వీపీఆర్ దంపతుల్లో ఉందని అందుకే వీరు రాజకీయాల్లోకి వచ్చారని చెప్పారు.

డీఎస్సీ అంటే జగన్‌కు డ్రగ్స్, శాండ్, చీప్ లిక్కర్ గుర్తుకొస్తాయి

గొడ్డలి పార్టీ అధినేతకు డీఎస్సీ అంటే డ్రగ్స్, శాండ్, చీప్‌లిక్కర్ గుర్తుకొస్తాయని లోకేశ్‌ఎద్దేవా చేశారు. 'మళ్లీ ఛాలెంజ్ చేస్తున్నా.. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం..జగన్ నువ్వు సిద్ధమా' అని సవాల్ విసిరారు. అరిగిపోయిన రికార్డులా డీఎస్సీలో అవకతవకలు అంటూ అబద్ధాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యకర్తలు నిజాన్ని ఎక్కువసార్లు ప్రజలకు చెప్పాలన్నారు.

మరోసారి ఆమె గురించి తప్పుగా మాట్లాడితే..

ప్రజల కోసం ప్రశాంతిరెడ్డి రాజకీయాల్లోకి వచ్చారని మంత్రి లోకేశ్ అన్నారు. కొంతమంది రౌడీలు, నియోజకవర్గానికి ఒక్క పని కూడా చేయనివారు ఆమె గురించి మాట్లాడుతున్నారని.. వీపీఆర్ కుటుంబం గురించి మాట్లాడే హక్కు వైకాపా నాయకులకు ఎవరిచ్చారని నిలదీశారు. మరోసారి అటువంటి మాటలు మాట్లాడితే వారి సంగతి చూస్తామన్నారు. గెలవకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా అన్న వ్యక్తి ఇప్పుడు ఏమయ్యాడో చూశామని.. ఈ రోజు అతడి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

కార్యకర్తలు ప్రజల చుట్టూ తిరగాలి..

పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని కార్యకర్తలు సమర్థంగా పూర్తిచేయాలని లోకేశ్ కోరారు. నాయకుల చుట్టూ కాకుండా కార్యకర్తలు ప్రజల చుట్టూ తిరగాలని.. వారిని గుర్తించే బాధ్యత తనదన్నారు. కార్యక్రమంలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, తెదేపా జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎండీ.ఫరూఖ్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా నుంచి 100% టారిఫ్ ముప్పు..

ఇప్పటికే చర్చించాం. ద్వైపాక్షిక సంబంధాలపై మాత్రమే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్ల స్థిరత్వంపై కూడా ఈ బిల్లు ప్రభావం చూపించే అవకాశం ఉందని స్పష్టంగా తెలియజేశాం.

భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను భారత ప్రభుత్వం తీసుకుంటుందని యూఎస్‌కు ఇప్పటికే చెప్పాం. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే భారత వాణిజ్యంపై పడే ప్రభావాలను ఎదుర్కొనేందుకు సంబంధిత సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం" అని కేంద్ర విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.

కులం, బంధుత్వం.. ఉత్తరాంధ్ర వైసీపీకి శాపాలు!

జిల్లాకు చెందిన సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు, ఆయన సోదరుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌పై మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు, వైసీపీ యువ నాయకుడు చిరంజీవి నాగ్ చేసిన విమర్శలు తీవ్ర దుమారం రేపుతున్నాయని చెబుతున్నారు. ధర్మాన సోదరులు కుల రాజకీయాలు చేస్తున్నారంటూ తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్ చేసిన ఆరోపణలు వైసీపీలో విస్తృత చర్చకు దారితీశాయని అంటున్నారు. తమ్మినేని అరెస్టు కాకపోవడానికి బంధుప్రీతి కారణమంటూ వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు ఈ విషయంపై రచ్చకు దారితీశాయని చెబుతున్నారు.ఇటు బొత్స, అటు ధర్మాన ఒకేసారి పార్టీ నేతల నుంచి అంతర్గత తిరుగుబాటు ఎదుర్కొంటుండటం పరిస్థితిని వేడెక్కిస్తోందని చెబుతున్నారు. బొత్స నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ ఆయన సొంత కుటుంబం నుంచే తిరుగుబాటు రావడం వైసీపీ వర్గాలను షాక్‌కు గురిచేసిందని అంటున్నారు. తన కుమార్తె జడ్పీ చైర్ పర్సన్‌గా పోటీ చేస్తుందన్న బొత్స ప్రకటనతో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అసంతృప్తికి లోనయ్యారని, అందుకే పార్టీని వదిలి వెళ్లిపోయారని చెబుతున్నారు. కుమార్తెపై బొత్స చూపిన మమకారంతో జిల్లాలో పార్టీ పురోగతిపై ఒక్కసారిగా దెబ్బ పడిందని కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారని అంటున్నారు. పైకి అంతా బొత్స అడుగుజాడల్లో పనిచేస్తున్నామని చెబుతున్నప్పటికీ, బొత్స కుటుంబ ప్రీతి, కులాభిమానంతో తమకు అవకాశాలు దక్కడం లేదని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగానే అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్.కోటకు చెందిన ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు రాజీనామా చేయగా, తాజాగా బొత్స మేనల్లుడు చిన్న శ్రీను సైతం గుడ్‌బై చెప్పారని అంటున్నారు.అదేవిధంగా శ్రీకాకుళం జిల్లాలోనూ పరిస్థితులు తయారయ్యాయని వైసీపీ నేతలు అంతర్గత సంభాషణల్లో చర్చించుకుంటున్నారని పరిశీలకులు చెబుతున్నారు. ఈ జిల్లాలో ధర్మాన సోదరుల నాయకత్వాన్ని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తదితరులు జీర్ణించుకోలేకపోతున్నారని తాజా సంఘటనలు ఉదహరిస్తున్నాయని అంటున్నారు. అందుకే తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్ బహిరంగంగా విమర్శలు చేశారని చెబుతున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సైతం ధర్మాన సోదరులపై ఇటువంటి ఆరోపణలు చేయడాన్ని గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ బంధుప్రీతి వల్లే భూ ఆక్రమణల కేసులో తమ్మినేని అరెస్టు కాలేదంటూ పార్టీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేసిన ఆరోపణలు కూడా వైసీపీలో పరిస్థితులను తెలియజేస్తున్నాయని చెబుతున్నారు. కులం, బంధుప్రీతి వంటి అంశాలకే ఆ పార్టీ నేతలు పరిమితమైపోతున్నారని, దీంతో నానాటికి పార్టీ పరిస్థితి దిగజారిపోతోందని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయంలో వైసీపీ హైకమాండ్ జోక్యం చేసుకోని పక్షంలో ముమ్ముందు మరింత మూల్యం చెల్లించుకోకతప్పని పరిస్థితి తలెత్తుతోందని కేడర్ నుంచి ఆందోళన వ్యక్తమవుతోందని అంటున్నారు.

రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు.సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

గ్రామాల్లో రెండున్నరేళ్లలో 20,600 కి.మీ. రోడ్ల నిర్మాణం

సౌకర్యం కల్పించామని 'ఎక్స్'లో బుధవారం వెల్లడించారు. 'అన్నదాతకు అండగా 1.15 లక్షల పంట కుంటలు నిర్మించాం. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం కోసం రైతులకు సాయం చేశాం. పాడి రైతుల కోసం 38 వేల మినీ గోకులాలు, 15 వేల నీటితొట్టెలు నిర్మించాం. ఏడున్నర దశాబ్దాలుగా రోడ్డు చూడని మారుమూల గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో విగ్రహాల ధ్వంసంతో అపవిత్రమైన రామతీర్థంలో భక్తుల సౌకర్యార్థం ఉపాధి హామీ పథకంలో రోడ్డు నిర్మించాం. అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్షేత్రానికి, కోటప్పకొండ, ఐఎస్ జగన్నాథపురం లాంటి వందల కొద్దీ క్షేత్రాలకు వెళ్లే భక్తుల ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరుస్తూ రోడ్లు నిర్మించాం' అని పవన్‌కల్యాణ్ వివరించారు. రోడ్ల నిర్మాణానికి సంబంధించిన రెండు ఫొటోలను దానికి జత చేశారు.

అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప్' వైద్య శిబిరాలు

104 సంచార వైద్యశాలల ద్వారా నిర్వహించే పరీక్షలతో ఈ శిబిరాలు అనుసంధానం చేస్తామని తెలిపారు.సేవా సంకల్ప్ అభియాన్ వైద్య శిబిరాల నిర్వహణ సన్నద్ధతపై అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలతో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు బుధవారం సమీక్ష నిర్వహించారు. శిబిరాల నిర్వహణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. రోగికి వైద్యం అందించడం ఎంత ముఖ్యమో.. ఆ చికిత్స వల్ల ఎలాంటి హానీ కలగకుండా చూడడమూ అంతే ముఖ్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. గురువారం ప్రపంచ రోగి భద్రత దినోత్సవం సందర్భంగా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'రాష్ట్రంలో 18 ఏళ్లు పైబడిన వారికి ఎన్‌సీడీ 4.0 సర్వే ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, గుర్తించిన వ్యాధిగ్రస్థులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు సంజీవనితో అనుసంధానం చేసి, ప్రతి రోగి ఆరోగ్య వివరాలు డిజిటలైజ్ చేస్తామని వెల్లడించారు.

విశాఖ, రాజమండ్రి.. ఈ రెండు కార్పొరేషన్లపై బీజేపీ నజర్

మూడు పార్టీల మధ్య ఇంతవరకు పొత్తు చర్చలు జరగలేదు. దీంతో కూటమిలో సీట్ల సర్దుబాటుపై అనేక అంచనాలు వెలువడుతూ రాజకీయ వాతావరణాన్ని హీటెక్కిస్తున్నాయి. ప్రధానంగా టీడీపీకి దీటుగా తమకు ముఖ్యమైన కార్పొరేషన్లు కావాలని కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు పట్టుబడుతున్నారని ప్రచారం రాజకీయాన్ని మరింత ఆసక్తికరంగా మార్చేస్తున్నట్లు చెబుతున్నారు.

రాష్ట్రంలో మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్లు ఉండగా, జనసేన, బీజేపీ నేతలు ముఖ్యమైన కార్పొరేషన్లపై ఇప్పటికే కర్చీఫ్ వేయడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. రాష్ట్రంలో అతిపెద్ద నగరాలైన విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, రాజమండ్రి కార్పొరేషన్లను మిత్రపక్షాలు కోరుతుండటం టీడీపీ నేతల్లో గుబులు పుట్టిస్తోందని చెబుతున్నారు. కార్పొరేషన్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించుకోవడం, ఎక్కువ ఓట్లు ఉన్న నగరాలలో పోటీకి మిత్రపక్షాలు ఉవ్విళ్లూరుతుండటంతో తమ పరిస్థితి ఏంటి అంటూ టీడీపీ నేతలు ఆవేదన చెందుతున్నారని చెబుతున్నారు. ప్రధానంగా బీజేపీ నేతలు విశాఖ, రాజమండ్రి కార్పొరేషన్ కోసం చేస్తున్న ప్రయత్నాలు కూటమిలో హాట్ టాపిక్ అవుతున్నాయి.ఉత్తర కోస్తాలోని ముఖ్యమైన నగరాలు విశాఖపట్నం, రాజమండ్రిల్లో మేయర్ పదవులను బీజేపీ కోరుకుంటోందని చెబుతున్నారు. విశాఖలో నార్త్ ఇండియన్ ఓట్లు అధికంగా ఉండటం తమకు అడ్వాంటేజ్ అవుతోందని, రాజమండ్రి ఎంపీగా పురందేశ్వరి ఉండటంతో ఆ మున్సిపల్ కార్పొరేషన్ లోనూ బీజేపీ బలం పెరిగిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అంతేకాకుండా ఆ రెండు నగరాలకు ఉన్న ప్రాముఖ్యత కారణంగా ఆయా కార్పొరేషన్ మేయర్ పదవులు తీసుకోవడం ద్వారా తమ పరపతిని జాతీయస్థాయిలో పెంచుకోవాలని బీజేపీ నేతలు ప్లాన్ చేస్తున్నారు. దీంతో కూటమిలో సీట్ల సర్దుబాటుపై ఒక అవగాహన కుదరకముందే విశాఖ, రాజమహేంద్రవరం (రాజమండ్రి) మేయర్లుగా పోటీ చేస్తామంటూ పలువురు బీజేపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని అంటున్నారు.దీంతో కూటమిలోని టీడీపీ నేతలు తమ రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. ముఖ్యమైన నగరాలపై మిత్రపక్షాలు పాగా వేసేందుకు తహతహలాడుతుండటం, ప్రత్యక్ష ఎన్నికల్లో ఆయా పార్టీలు తలపడే పరిస్థితి లేకపోవడమే వారిని ఎక్కువ ఆందోళనకు గురిచేస్తోందని చెబుతున్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో అభ్యర్థి ఇమేజ్ తోపాటు ఆర్థిక బలం కూడా కీలకంగా పనిచేస్తుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రెండింటిని సమకూర్చుకోగల నేతలు బీజేపీలో లేరని ప్రచారం చేస్తూ బీజేపీకి ముఖ్యమైన కార్పొరేషన్లు ఇచ్చే పరిస్థితి లేదని టీడీపీ నేతలు సంకేతాలు పంపుతున్నారు. దీంతో కూటమి రాజకీయాలు తీవ్ర ఆసక్తి రేపుతున్నాయని చెబుతున్నారు.

పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు: జగన్ పై అనిత ఫైర్

విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతుందో ప్రధాని చూపించారు

వేశారు. ప్రపంచంలోని 101 దేశాలకు కొవిడ్ వ్యాక్సిన్లు పంపారు. గతంలో భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకునేది. ప్రస్తుతం దేశంలోనే ఆయుధాల ఉత్పత్తి జరుగుతోంది. టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీనే. మహిళలే కేంద్రంగా దేశంలో అభివృద్ధి జరుగుతోంది. బేటీ బచావో.. బేటీ పడావో, ఉజ్వల సహా తదితర పథకాల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతోంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతుందో ప్రధాని చూపించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పారు. దేశంలో తీవ్రవాదం లేకుండా చర్యలు చేపట్టారు. సుదీర్ఘకాలం నలిగిన అయోధ్య సమస్యను పరిష్కరించారు" అని చంద్రబాబు కొనియాడారు.

పోరుమామిళ్లలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 17) పోరుమామిళ్ల బ్రహ్మం గారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్



వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మన సుబ్బరాయుడు, జిల్లా అధికార ప్రతినిధి నారోజు రమణచారి, అసెంబ్లీ కో కన్వీనర్ పల్లంశెట్టి పండారి, ఉపాధ్యక్షులు చెన్నయ్య, బ్రహ్మయ్య, రామస్వామి, ఈశ్వరమ్మ, కిసాన్ మోర్చా నాయకులు తమ్మిశెట్టి రమణ, తదితరులు కార్యక్రమం అనంతరం ఆలయ చైర్మన్ బాల నరసింహచారి విచ్చేసిన అతిథులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే మెషిన్లను ప్రారంభించిన కీర్తి సరోజ్



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టెంబర్ 17)



చిన్నగంజాం మండలం కడవకుదురు గ్రామంలో జరిగిన సంచార చికిత్స కార్యక్రమాల్లో భాగంగా ఇంటి ముంగిటనే ఉచితంగా టీబీ,క్షయా వ్యాధి లక్షణాలను గుర్తించే అత్యాధునిక హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే మెషిన్లను సంతరావురు ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కె.కీర్తి సరోజ్ గురువారం ప్రారంభించారు. ముందుగా సేవా-సంకల్ప అభియాన్ ర్యాలీ నిర్వహించి అనంతరం హెల్డ్ ఎక్స్-రే మెషిన్లను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో క్షయ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే, కేవలం రెండు నిమిషాల్లో వేగంగా గుర్తించేందుకు ఈ పరికరం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గ్రామంలో 107మందికి ఎక్స్-రే చేస్ట్ పరిక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ శ్రీధర్, పి వర్ష దార, 104 డిఇఓ పొదిలి రాఘవ, ఎంఎల్‌హెచ్‌పి పి రమ్య, కె స్మైలీ, ఎఎన్ఎం శారదా, కోటేశ్వరమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

చిన్నగంజాం ఆరోగ్య కేంద్రంలో..

మండలంలోని చిన్నగంజాం ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ పి సాయి శ్రీ చరణ్ ఆధ్వర్యంలో సేవా -సంకల్ప అభియాన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే మెషిన్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ పి ఝన్సీరాణి, హెచ్ శ్రీధర్, స్టాఫ్ నర్సు కట్టా ప్రసూన, తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

18.09.26 శుక్రవారం

ఆశల పల్లకిలో ఆశావాహులు

మొదలైన ఎన్నికల వేడి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, సెప్టంబర్ 17)



ఎన్నికల వేడి రాజుకుంది....అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇప్పటికే వార్డుల వారీ ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. అక్టోబర్ 3వ తేదీన స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ రానుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. కూటమి నాయకులకు ఆ మేరకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తుంది. ప్రధాన పార్టీలతో మండల స్థాయి అధికారులు, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు ఇతర అంశాల పై సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ ఏ కేటగిరికి రిజర్వ్ అవుతుందనే చర్చ జోరుగా సాగుతోంది....రెండు పర్యాయాలు బిసి అయినా ఛైర్మన్ గిరి ఓసి కి కేటాయిస్తారా లేక ఎస్సీ రిజర్వుడ్ అవుతుందా అనే చర్చ కూడా నడుస్తోంది. కనిగిరి మున్సిపాల్టీలో ఉన్న 20 వార్డులు 32 వార్డులయ్యాయి. ఇప్పటికే ఓటర్ల జాబితా, ఏఏ ఏరియాలు ఏ వార్డుల పరిధిలో ఉంటాయి మున్సిపల్ అధికారులు ప్రకటించారు. అయితే ఏ వార్డు ఏ రిజర్వేషన్ కేటగిరికి చేయాలనే కసరత్తులో మున్సిపల్ అధికారులు నిమగ్నమయ్యారు. వార్డుల రిజర్వేషన్లకు సంబంధించి ప్రతిపాదనలు కూడా పంపినట్లు తెలుస్తుంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత మండల పరిషత్, జిల్లా పరిషత్ లకు ఎన్నికలు జరిగే పరిస్థితులు ఉన్నాయి. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి టిడిపి సోషల్ మీడియా గ్రూపులో జడ్పీటిసి పదవులు ఆశించే వారు వారి పేరు వివరాలను తన పర్సనల్ వాట్సప్‌కు పంపాలని కోరారు. దాంతో కనిగిరి జడ్పీటిసి సీటు కోసం 22 మంది, పామూరులో 15 మంది, వెలిగండ్లకు 17 మంది, హనుమంతునిపాడుకు 16 మంది, పీసీపల్లిలో 13 మంది, సిఎస్‌పురంలో 11 మంది జడ్పీటిసి అభ్యర్థులుగా పోటీ చేస్తామని ఎమ్మెల్యే వ్యక్తిగత వాట్సప్‌కు పేర్లు, వారి వివరాలు పంపారు. అయితే ఏ మండలం ఏ రిజర్వేషన్ కు కేటాయించబడతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దాంతో జనరల్, ఎస్సీ, బిసి ఆశావాహులు అందరూ వాట్సప్‌లో తాము పోటీకి సిద్ధమంటూ ఎమ్మెల్యేకు మెసేజ్‌లు పంపారు. కొందరు నాయకులు అయితే జడ్పీటిసి కన్నా ఎంపిపి పోస్టు కీలకమని ఆ పదవి అడుగుదామని కొందరు ఆశావాహులు సిద్ధంగా ఉన్నారు. పదవి ఆశించే వారికి ఆర్థిక, అంగ బలం అనేది కీలకం...అధికార పార్టీ లో ఆశావాహుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది...కానీ ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రకటించారు. ఎక్కడైనా పోటీలో వైసీపీ అభ్యర్థి లేకపోతే అందుకు పార్టీ ఇన్‌ఛార్జిలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించిన పరిస్థితులు ఉన్నాయి. వైసీపీ కూడా ఆర్థిక, అంగ బలం ఉన్న అభ్యర్థుల అన్వేషణలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఆ పార్టీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ కనిగిరి మున్సిపాల్టీ పరిధిలో ప్రధాన నాయకులతో సమావేశం నిర్వహించారు. వెలిగండ్ల మండలంలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం పై జడ్పీటిసి గుంటక తిరుపతిరెడ్డి, ఇతర నాయకులతో చర్చించారు. ఏ విధంగానైనా అన్ని వార్డులు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలకు అభ్యర్థులను బరిలోకి దింపేందుకు ఆ పార్టీ నాయకులు కసరత్తు చేస్తున్నారు. కానీ అధికార టీడీపీ నాయకులు అభివృద్ధి మంత్రంతో ప్రజల్లోకి వెళ్ళి అన్ని స్థానాలు గెలవాలన్న కుతూహలంతో ఉన్నారు. ప్రధాన పార్టీల్లో ఆర్థిక, అంగబలం ఉన్న నాయకులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సన్నద్ధమయ్యారు.

రూ.7 వేలు ఇస్తేనే హెడ్జ్ ఫీజ్ వేస్తా



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, సెప్టంబర్ 17)

అక్షరాల రూ.7 వేలు ఇస్తేనే హెడ్జ్ ఫీజు వేస్తానని విద్యుత్‌శాఖ లైన్ మెన్ అంటున్నాడని పీసీపల్లి మండలం గుంటుపల్లికి చెందిన సరాల గాయత్రి అనే మహిళా రైతు వాపోయింది. మూడు రోజుల క్రితం మా పొలానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ హెడ్జ్ ఫీజు పోయిందని, ఈ నెల 13వ తేదీ నుంచి లైన్‌మెన్‌కు ఫిర్యాదు చేస్తున్నామని ఆమె తెలిపారు. మొదట సమాధానమే చెప్పని లైన్‌మెన్ ఆ తర్వాత రూ.7 వేలు ఇస్తేనే ఫీజులు వేస్తామని ఖరాఖండిగా చెప్పాడని ఆమె వాపోయింది. లైన్‌మెన్ అవినీతి, నిర్లక్ష్యం పై గురువారం మార్కాపురం విద్యుత్‌శాఖ ఎస్ఈ అబ్దుల్ కరీంకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. హెడ్జ్ ఫీజు వేయనందు వలన పరినాట్లు ఆగిపోయాయని ఆ మహిళా రైతు వాపోయింది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి లైన్‌మెన్ పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరారు.

అద్దంకి అభివృద్ధిలో మరో ముందడుగు

రూ.7.72 కోట్లతో విద్యుత్ ఉపకేంద్రం..
రూ.2.25 కోట్లతో నూతన అగ్నిమాపక కేంద్రం
ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, సెప్టంబర్ 17)

అద్దంకి పట్టణ మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా గురువారం రోజున రూ.9.97 కోట్ల వ్యయంతో పూర్తయిన పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలిసి వైభవంగా ప్రారంభించారు. అద్దంకి మండల కేంద్రంలో రూ. 7.72 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సెమీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రాన్ని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2.25 కోట్లతో నిర్మించిన అగ్నిమాపక కేంద్రం నూతన భవనాన్ని, కొత్త ఫైర్ ఇంజన్ వాహనాన్ని మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ సాధించిన ప్రగతిని మరియు అద్దంకి ఫైర్ స్టేషన్ శాఖాపరమైన వివరాలను సమగ్రంగా వెల్లడించారు. అద్దంకి అగ్నిమాపక కేంద్రం 2012లో మంజూరై, 2013 డిసెంబర్ 30 నుండి అగ్రికల్చరల్ మార్కెట్ యార్డ్‌లోని ఒక తాత్కాలిక రేకుల షెడ్డులో ఏకైక గ్యారేజీతో కొనసాగుతుండేదని హోం మంత్రి గుర్తుచేశారు. ఈ పరిస్థితిని మారుస్తూ, నార్త్ అద్దంకిలోని సర్వే నంబర్ 204-3లో కేటాయించిన 0.23 ఎకరాల స్థలంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2.25 కోట్లతో ఈ నూతన భవనాన్ని నిర్మించామని తెలిపారు.

ఈ అద్దంకి ఫైర్ స్టేషన్ పరిధిలోకి అద్దంకి, కొరిశపాడు, జే.పంగులూరు, బల్లికురవ, సంతనూతలపాడు, ముండ్లమూరు అనే 6 మండలాలు వస్తాయని, ఈ ఆరు మండలాల అత్యవసర సేవల అవసరాలను ఈ కేంద్రం సమర్థవంతంగా తీరుస్తుందని మంత్రి స్పష్టం చేశారు. అగ్నిమాపక కేంద్రం సామర్థ్యాన్ని పెంచేందుకు 2025 మోడల్ అశోక్ లేలాండ్, టాటా, బాబిలియాని, ఫైర్ ప్లే మోడల్ వాహనాలతో పాటు పూర్తిస్థాయి సిబ్బందిని, అధునాతన పరికరాలను అందుబాటులోకి తెచ్చామని మంత్రి తెలిపారు. శాఖాపరమైన పనితీరు వివరాలను ప్రతిబింబించే గణాంకాలను ఆమె ప్రస్తావిస్తూ, 2025-26 సంవత్సరంలో ఈ స్టేషన్ పరిధిలో 47 ప్రమాద సంఘటనలు నమోదవ్వగా, సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి రూ.1.70 కోట్ల విలువైన ఆస్తిని కాపాడటమే కాకుండా 6 గురిని రెస్క్యూ ఆపరేషన్ల ద్వారా సురక్షితంగా రక్షించారని కొనియాడారు. అలాగే ప్రస్తుత 2026-27 సంవత్సరంలో ఇప్పటివరకు నమోదైన 94 ప్రమాద సంఘటనల్లో రూ. 2.05 కోట్ల ఆస్తిని కాపాడారని, ఇద్దరి ప్రాణాలను రక్షించారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అగ్నిమాపక శాఖలో గతంలో ▶4లో

మేదరమెట్లలో పోలీసు "సింగం"



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, సెప్టంబర్ 17)

మెదరమెట్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఇటీవల కాలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబు విధి నిర్వహణలో పోలీస్ పవర్ చూపిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారికి సింహ స్వప్నంలా మారారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి స్టేషన్ పరిధిలోని గ్రామాలో తో పాటు మెదరమెట్లలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవడంలో సఫలమయ్యారు. దీంతో వచ్చిన కొద్ది కాలంలోనే ప్రజల్లో మంచి పోలీస్ గా పేరు సంపాదించుకున్నారు. మందు తాగి ఆగడాలు చేసే వారిపై తనదైన స్టైల్ లో కౌన్సిలింగ్ ఇస్తూ విధి నిర్వహణలో తన మార్కు ను చాటుకుంటున్నారు. ఆకతాయిలు తప్పు చేయాలంటే భయపడే విధంగా చేస్తూ పాలన సాగిస్తూ ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాడని గ్రామంలోని ప్రజలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బస్టాండ్ సెంటర్, మార్కెట్ యార్డ్ లో దొంగతనాలు జరగకుండా పోలీస్ సిబ్బంది చే పర్యవేక్షణ చేస్తూ మానిటరింగ్ చేస్తున్నారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైవేపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నారని ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద ఎస్ఐ రమేష్ బాబు రియల్ పోలీస్ "సింగం" లా ప్రజల మన్ననలు పొందారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 17)

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ప్రజలకు సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దోర్నాల మండలం కొర్రప్రోలు గ్రామంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లీ ఫౌండేషన్ సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు వైద్య సేవలు అందించడం ద్వారా వారి ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం ▶4లో

పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చాటాలి

ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించండి
విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించండి
అందుకే వన్ ఆఫీసర్-వన్ ఇన్‌స్టిట్యూట్
అధికారులకు కలెక్టర్ రాజాబాబు దిశానిర్దేశం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 17)

వచ్చే ఏడాది జరిగే పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో ప్రభుత్వ విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటేలా ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. ఈ దిశగానే ప్రతి పాఠశాల, హాస్టల్ కు ప్రత్యేక అధికారిని కేటాయిస్తూ 'వన్ ఆఫీసర్ - వన్ ఇన్స్టిట్యూట్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. గురువారం క్యాంపు కార్యాలయం నుంచి అన్ని మండలాలలోని అధికారులతో ఆయన వీడియో ▶4లో

అద్దంకి అభివృద్ధిలో మరో ముందడుగు











ఎన్నడూ లేని విధంగా రూ.125 కోట్లతో మౌలిక వసతుల కల్పన, నూతన భవనాలు, ఆధునిక యంత్రాల కొనుగోలు పనులు చేపడుతున్నామని, ఈ దిశగా సమర్థవంతంగా పనిచేస్తున్న అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ గారిని మరియు అధికారులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక మరియు పోలీస్ సిబ్బంది వేగంగా చేరుకోవడానికి అనువుగా రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేశామన్నారు. స్థానిక ఎమ్మెల్యే, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సేవలను కొనియాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనులు వేగవంతం చేస్తున్న మంచి మంత్రి అద్దంకి కి ఉన్నారని తెలిపారు. ఎల్‌నినో వంటి పరిస్థితులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకుండా చూడటం విద్యుత్ శాఖ సాధించిన విప్లవాత్మక విజయం అని ప్రశంసించారు. డిఎస్సీ నిర్వహణపై ప్రభుత్వంపై వస్తున్న అసత్య ఆరోపణలను ఖండిస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు సంపూర్ణ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ అద్దంకిలో రూ. 7.72 కోట్లతో సెమీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మరియు రూ. 2.25 కోట్లతో ఫైర్ స్టేషన్ నూతన భవనం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. తమ నియోజకవర్గానికి అడిగిన వెంటనే నూతన ఫైర్ స్టేషన్ భవనంతో పాటు కొత్త ఫైర్ ఇంజన్ వాహనాన్ని మంజూరు చేసిన హోం మంత్రి అనితకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నూతన సబ్‌స్టేషన్ ద్వారా అద్దంకి, చుట్టుపక్కల ప్రాంతాల్లో లో-వోల్టేజ్ సమస్యలు పూర్తిగా తొలగిపోయి నిరంతర నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అబివృద్ధి,సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. అబివృద్ధి కార్యక్రమాలకు పిలిచిన వెంటనే తమ అద్దంకి నియోజకవర్గానికి వచ్చిన మంత్రి అనితకి కృతజ్ఞతలు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

సింగరకొండలో ఆలయంలో ప్రత్యేక పూజలు....

అంతకముందు మంత్రులిద్దరూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి మంత్రోచ్చారణలతో వేదాశీర్వచనం అందించి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను బహూకరించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సుందరం, విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, జిల్లా అగ్నిమాపక అధికారి కే శ్రీకాంత్‌రెడ్డి, ఏపీ పోలీస్ హౌసింగ్ ఈఈ బి మురళీకృష్ణ, ఇతర శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం విజయవంతం



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, సెప్టెంబర్ 17)

ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 76వ జన్మదిన వేడుకల సందర్భంగా ఉప్పుటూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ గురువారం ఉదయం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అడపాల కృష్ణ ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ చేతుల మీదుగా పంచాయతీ కార్యాలయం వద్ద నరేంద్ర మోడీ పుట్టిన రోజు కేక్ కటింగ్ చేయించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ మన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేడు 76వ సంవత్సరంలోకి అడుగుపెట్టారని, ఆయన ఒక సామాన్యునిగా జన్మించి ఒక అసమాన్యునిగా ఎదిగి భారతీయులందరికీ స్ఫూర్తిగా నిలిచారని, ఆయన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నుంచ దేశవ్యాప్తంగా ఆయుష్ వైద్యానికి ఎంతగానో ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ సంవత్సరం మన ఆంధ్ర రాష్ట్రానికి ఆయుష్ వైద్య అభివృద్ధి కోసం 185.75 కోట్ల నేషనల్ ఆయుష్ మిషన్ నిధులు కేటాయించారని, ఇది వారికి దుష్ఫలితాలు లేని మన భారతీయ సాంప్రదాయ వైద్య విధానాలపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని, కావున ప్రజలందరూ కూడా ప్రభుత్వం వారు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను వినియోగించుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని కోరుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరు పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది, ఎమ్మెల్యే హెచ్ పి శృతి, బిజెపి నాయకులు కాంచనపల్లి శ్రీనివాసరావు, మర్రిపూడి నటరాజ్, బొగది నాగేశ్వరరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

చేయకుండా, వైద్యుల సూచనలు పాటించాలని కలెక్టర్ కోరారు. వైద్య శిబిరాల్లో ఉచితంగా అందిస్తున్న మందులను ఉపయోగించుకుంటూ, వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచితంగా పంపిణీ చేస్తున్న మందులను వైద్యుల సూచనల మేరకు వినియోగించుకోవాలని తెలిపారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో మనస్సే, జిల్లా మలేరియా అధికారి కె రాహుల్, బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి ఏలూరి రామచంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చాటాలి



కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో అమలు చేసిన ఈ విధానం ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. వచ్చే ఏడాది అత్యుత్తమ ఫలితాలు రాబట్టేందుకు ఇప్పటినుంచి ప్రత్యేక అధికారులు దృష్టి సారించాల్సి ఉందన్నారు. అధికారిగానే కాకుండా తల్లిదండ్రులుగా ఆలోచించి, ప్రభుత్వ సంస్థలలో చదువుతున్న విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించి, నైతిక బాధ్యతతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీల విద్యార్థులలో స్ఫూర్తిని నింపేలా వారితో మాట్లాడాలన్నారు. ఆయా సంస్థలలో ఏమైనా మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే' నిర్వహిస్తున్నందున వివిధ అంశాలపై విద్యార్థులలో అవగాహన పెరిగేలా 'యువసాథీ' కార్యక్రమం క్రింద చర్చా వేదికలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈవో సివి రేణుక, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి జనరిక్ మంచి ఔషదం ఎమ్మెల్యే జూలకంటి

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 17)

పేద ప్రజల ఆరోగ్యానికి జనరిక్ మంచి ఔషదమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషది కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సూపరింటెండెంట్ కేపీ చారి, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, యెనుముల కేశవరెడ్డి, అభివృద్ధి కమిటి సభ్యులు మాచర్ల వాసు, దుర్గా, వైద్యులు శ్రీకాంత్,కొమెర దుర్గారావు, కొల్లి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.







శ్రీవాణి విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసం హెల్త్ కార్డుల పంపిణీ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 17)

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసం శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు ఆధ్వర్యంలో కొత్తపట్నంలోని శ్రీవాణి విద్యానికేతన్ విద్యార్థులకు గురువారం ఉదయం "శ్రీరామ్ ఆరోగ్య రక్ష" హెల్త్ కార్డులను డాక్టర్ చాపల వంశీ కృష్ణ, డాక్టర్ చాపల శాంత కుమారిలు పంపిణీ చేశారు. ఈ హెల్త్ కార్డు ద్వారా విద్యార్థులు అందరూ ఈ విద్యా సంవత్సరం మొత్తం హాస్పిటల్‌లోని అన్ని మల్టీ స్పెషాలిటీ విభాగాలలో ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలోనూ, భవిష్యత్తులోనూ మంచి ఫలితాలు సాధించగలరని, చిన్న వయసులోనే ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా శ్రీరామ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చాపల వంశీ కృష్ణ తెలిపారు. గత పది సంవత్సరాలుగా శ్రీరామ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ హెల్త్ కార్డులు అందజేస్తున్నామని, ఎంతోమంది విద్యార్థులకు ఈ కార్డుల ద్వారా ప్రయోజనం చేకూరిందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ హెల్త్ కార్డులు ఆరోగ్య పరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ డాక్టర్ చాపల కోటేశ్వర రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులకు యోగా శిక్షణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 17)

ప్రభుత్వ వైద్య కళాశాల, ఒంగోలులో నూతనంగా చేరిన ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఫౌండేషన్ కోర్సులో భాగంగా యోగా ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగా కేంద్రంకు చెందిన డాక్టర్ ఆర్ ప్రసాద్‌రావు, వారి బృందం పాల్గొని, విద్యార్థులకు వివిధ యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. యోగాసనాలను సరైన పద్ధతిలో ఆచరించే విధానాన్ని ప్రదర్శించి, వాటి వల్ల కలిగే శారీరక, మానసిక ప్రయోజనాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శ్రీమణి గారు, వైస్ ప్రిన్సిపాల్ (అకాడమిక్), కమ్యూనిటీ మెడిసిన్ విభాగ ప్రొఫెసర్ మరియు హెచ్ఓడీ డాక్టర్ బి శ్రీదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే ఫౌండేషన్ కోర్స్ మానిటర్ సోషియల్ సైన్స్ లెక్చరర్ ఎంవి రవిశంకర్, హెల్త్ ఎడ్యుకేటర్ టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వైద్య విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందించేందుకు యోగా ఎంతో దోహదపడుతుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. వైద్య విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు.

అన్నదానంలో షేక్ రసూల్ మహమ్మద్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 17)

పట్టణంలోని ఓబులశెట్టి వారి వీధిలో వినాయక చవితి మండపం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్ ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు. ఆయన వెంట కమిటీ సభ్యులు పాల్గొన్నారు

హోం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 17)

ప్రకాశం జిల్లా అద్దంకిలో పలు కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ను గురువారం అద్దంకిలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి వంగలపూడి అనిత పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

సరైన కారణాలు లేకుండా ఓటరు దరఖాస్తులు, అభ్యంతరాలను తిరస్కరించవద్దు


జిల్లా కలెక్టర్ పిరాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 17)

సరైన కారణాలు లేకుండా ఓటరు దరఖాస్తులను, అభ్యంతరాలను తిరస్కరించవద్దని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. ఓటర్లు సమర్పించే ఫోటో నాణ్యతను కూడా పరిశీలించాలని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టరో పాటు డిఆర్ఓ పివి రమణ, ఇతర నియోజకవర్గాల ఈఆర్ఓలు పాల్గొన్నారు. ఫైనల్ జాబితా ప్రచురణ కోసం సిద్ధపాటు, అభ్యంతరాల పై నోటీసుల జారీ, విచారణ, ఫారం 6,7,8 పరిశీలన, తదితర అంశాల పై సీఈవో ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయా అంశాలలో పెండింగ్ చాలా స్వల్పంగా (2.5 శాతం) ఉందని, రెండు రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఈఆర్వోలతో కలెక్టర్ సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా పురోగతిని తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని, బిఎల్ఓలకు అవసరమైన అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఈఆర్వోలు హిమవంశీ, రవికుమార్, చంద్రశేఖర్ నాయుడు, మాధురి, శాంతిలక్ష్మి, జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం మండలంలో రూ.2.60 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



(షణ్ముఖ వెలుగు, బ్రహ్మంగారి మఠం, సెప్టెంబర్ 17)

మైదుకూరు నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. గురువారం బ్రహ్మంగారి మఠం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే సుమారు రూ.2.60 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన స్మశాన వాటికలు, ఆర్ఓ ప్లాంట్లు, సీసీ రోడ్లు, పాఠశాల కాంపౌండ్ వాల్, మినీ గోకులం తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గారు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

9 గ్రామాల్లో స్మశాన వాటికలు ప్రారంభం

బ్రహ్మంగారి మఠం మండలంలోని రేకులగుంట హరిజనవాడ, డి.అగ్రహారం, పెద్దిరాజుపల్లె, చౌదరివారిపల్లె, కొత్తపల్లె, ముడుమాల, బ్రహ్మంగారి మఠం టౌన్, రాజుపేట, సోమిరెడ్డిపల్లె గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన 9 స్మశాన వాటికలను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. ఒక్కో స్మశాన వాటిక నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున నిధులు వెచ్చించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో భాగంగా స్మశాన వాటికలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.

రెండు ఆర్ఓ ప్లాంట్లు ప్రారంభం

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో ణవీఖీ నిధులు రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు ఆర్ఓ ప్లాంట్లను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. వాంపల్లి చెరువు, రాజుపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈ ఆర్ఓ ప్లాంట్ల ద్వారా స్థానిక ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులోకి రానుంది. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట్ల తాగునీటి వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం
గ్రామాల సమగ్ర అభివృద్ధికి నిరంతర కృషి






రాజుపేటలో పలు అభివృద్ధి పనులు

రాజుపేట గ్రామంలో కూడా పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన జజ రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చారు. దీంతో గ్రామంలోని రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది. అదే విధంగా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన రాజుపేట పాఠశాల కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించారు. పాఠశాల పరిసరాలను సురక్షితంగా, ఆహ్లాదకరంగా ఉంచేందుకు కాంపౌండ్ వాల్ ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే రూ.2.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినీ గోకులంను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. పశుపోషకులకు, గ్రామీణ రైతులకు మద్దతుగా అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజల సమస్యల పై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా ఆయా గ్రామాల



ప్రజలు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ని కలిసి తమ సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఇళ్ల కేటాయింపు, పింఛన్లు, విద్యుత్ సమస్యలు, తదితర అంశాల పై ప్రజలు వినతులు సమర్పించారు. ప్రజలు తెలిపిన సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా విని, వాటి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, పశుసంపర్ధక రంగాలతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల అవసరాలను స్థానిక ప్రజలు, నాయకుల ద్వారా తెలుసుకుని దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి అందరి సహకారంతో నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 9వ జాతీయ పోషణ మాసం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 17)



కనిగిరి మండలం లింగారెడ్డిపల్లి అంగన్వాడి కేంద్రం నందు 9వ జాతీయ పోషణ మాసం 2026 “మన అంగనవాడి–మన బాధ్యత” అనే నినాదంతో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లే తొలి అడుగు అంగన్వాడీ కేంద్రం నుంచే మొదలవుతుందని, పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడే మంచి ఆహారం తినిపిస్తే వారి ఎదుగుదల చాలా బాగుంటుందన్న ఉద్దేశంతో 3–6 సంవత్సరం లోపు పిల్లలకు ప్రతి రోజు తాజాగా వేడిగా వండిన భోజనాన్ని అందిస్తున్నామని చిన్నారులు ఇష్టంగా తినేందుకు వారానికి రెండు రోజులు ఎగ్ ఫ్రైడ్ రైస్ పెడుతున్నామని, మెనూలో మార్పులు చేశారని, మెనూ పట్టికను ప్రదర్శించి చూపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే చిరుధాన్యాలతో ఆహారాన్ని తయారు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా గర్భవతులు, బాలింతలు, ఏఎంసి సభ్యులకు , స్వయం సహాయక సంఘ సభ్యులకు చూపించారు. తాజాగా ఆహారంలో మునగ పొడిని లేదా మునగాకును తీసుకోవడం వల్ల ఇనుము, విటమిన్లు అధికంగా లభించి రోగ నిరోధకశక్తి పెరుగుతుందని జంక్ ఫుడ్, ప్యాకెట్ ఫుడ్ తినవద్దని అవగాహన కలిగించారు. జాతీయ పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోషక విలువలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ర్యాలీ నిర్వహించిరి. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సిహెచ్ సరస్వతి, ఎం భాగ్యలక్ష్మి, గ్రామంలోని గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు, ఏఎంసీ సభ్యులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, పిల్లలు పాల్గొన్నారు.



21 నుంచి అక్రిడేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు సెప్టెంబరు 30 వరకు గడువు
హార్డ్ కాపీల సమర్పణకు అక్టోబర్ 7 వరకు గడువు
రెండో విడతలో అర్హులందరికీ కార్డుల మంజూరు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 17)

జిల్లాలో అర్హత ఉండి, మొదటి విడతలో అక్రిడేషన్ పొందని పాత్రికేయులందరూ సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన విలేకరులకు మొదటి విడతలో అక్రిడేషన్ కార్డులను మంజూరు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మొదటి విడతలో కార్డులు లభించని అర్హులైన పాత్రికేయుల కోసం రెండో విడత ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల ప్రారంభ తేదీ 21 సెప్టెంబర్ 2026 (సోమవారం) నుండి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అర్హులైన పాత్రికేయులు సెప్టెంబరు 30, 2026 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసిన అనంతరం, దానికి సంబంధించిన ఫిజికల్ కాపీలను (హార్డ్ కాపీలు) అవసరమైన ఆధారాలతో జతచేసి జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిఐపిఆర్ఓ) కార్యాలయంలో అక్టోబర్ 7, 2026 లోపు సమర్పించాల్సి ఉంటుంది. రెండో విడతలో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, జిల్లాలోని అర్హులైన పాత్రికేయులందరికీ త్వరలోనే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.



ఆపదలో కుటుంబానికి ఎమ్మెల్యే అండ

(షణ్ముఖ వెలుగు, చీరాల, సెప్టెంబర్ 16)

ఆపదలో ఉన్న కుటుంబానికి చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అండగా నిలిచారు. ఈపురుపాలెం గ్రామానికి చెందిన షేక్ ఆమాన్ భాష కుటుంబానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లి రూ.4 లక్షల ఆర్థిక సాయం, పెన్షన్ మంజూరు చేయించారు. ఇందులో భాగంగా గురువారం బాధిత కుటుంబానికి రూ.4 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఆగస్టు 7న ముఖ్యమంత్రి దృష్టికి కుటుంబ పరిస్థితిని తీసుకెళ్లిన ఎమ్మెల్యే మాలకొండయ్య, ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, ప్రతి కుటుంబానికి భరోసాగా ఉంటానని తెలిపారు.

మోడీ మార్గదర్శనంలో దేశాభివృద్ధి
బిజెపి నాయకులు బొమ్మన సుబ్బరాయుడు

అనాథ వృద్ధులకు వస్త్రాలు, భోజనం, తినుబండారాలు వితరణ చేసిన బొమ్మన ఫౌండేషన్ సుబ్బరాయుడు







(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టంబర్ 17)
ఃబద్వేలు పట్టణంలోని ఆనంద నిలయం ఆశ్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బొమ్మన ఫౌండేషన్ నిర్వాహకులు బొమ్మన సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా ఎదుగుతోందని కొనియాడారు. దేశ ప్రయోజనాలే పరమావధిగా మోడీ అందిస్తున్న సుపరిపాలన ప్రతి ఒక్కరికీ ఆదర్శదాయకం. నవ భారత్ నిర్మాణంలో ఆయన చేపడుతున్న విప్లవాత్మక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమాజంలోని చివరి వ్యక్తికి కూడా ఫలాలను అందిస్తున్నాయి. పేదరిక నిర్మూలన, స్వదేశీ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం మరియు దేశ భద్రత విషయంలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు చారిత్రాత్మకమైనవన్నారు. సుమారుగా తొమ్మిదేళ్లకు పైగా ఆయన అందిస్తున్న ఈ సేవా ప్రయాణం భారతీయులందరికీ గర్వకారణం అని పేర్కొన్నారు. అనంతరం మోడీ జన్మదినం గురించి ప్రస్తావిస్తూ, దేశ సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన మోడీ పుట్టినరోజున ఇలాంటి నిరాశ్రయులకు, వృద్ధులకు సేవ చేయడం మాకు ఎంతో సంతోషాన్ని, తృప్తిని ఇస్తోంది. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు నడిపించే శక్తిని ఆ భగవంతుడు ఆయనకు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశ్రమవాసులకు చీరలు, పంచెలు, టవళ్లు, రుచికరమైన భోజనం, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేక కేక్ కట్ చేసి మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో బిజెపి పట్టణ అధ్యక్షులు ధరిమిశెట్టి వెంకటసుబ్బయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి మేడిపోయిన ఆంజనేయులు, ఓబిసి మోర్చా అధ్యక్షులు గాండ్ల యాదవ రవీంద్ర, పోలింగ్ బూత్ అధ్యక్షులు వల్లంకొండు సూర్యనారాయణ, పాపదిప్పు మల్లికార్జునరెడ్డి, కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ సివి నాగేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు విడతల రవికుమార్‌తో పాటు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశం గర్వించతగ్గ వ్యక్తి ప్రధాని మోదీ ఎమ్మెల్యే జూలకంటి





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 17)
భారతదేశం గర్వించతగ్గ వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రశంసించారు. నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పార్క్ సెంటర్ నందు కూటమి పార్టీల శ్రేణులు ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే జూలకంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారీ కేక్ ను కట్ చేసి మోదీజీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న జై జవాన్.. జై కిసాన్ అనే నినాదానికి జై విజ్ఞానిక్ అని జోడించి, ప్రపంచానికే విజ్ఞానం అందించే స్థాయికి భారత్ ను మోదీ నిలబెట్టారని చెప్పుకొచ్చారు. ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు అనేక సంస్కరణలు తీసుకొచ్చి, పొరుగు దేశాలతో మిత్రుత్వాన్ని నడుపుతూ గొప్ప దౌత్యవెత్తగా తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు నాయకులు కాశీపతి, క్రాంతికుమార్, యెనుముల కేశవరెడ్డి, రాజబోయిన మధు, కొమెర దుర్గారావు, కంభంపాటి అనిల్ కుమార్,శాంతి, బొగ్గవరపు మస్తాన్ రావు, మారం వంశీకృష్ణ, నాగారాజు, శివ కోటయ్య నాయక్,యేచూరి సురేష్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ విజయ గణపతి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని అన్నసంతర్పరణ ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 17)
ఒంగోలులోని అన్నవరపాడులోని పార్కు సమీపంలో టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీ విజయ గణపతి కమిటీ సభ్యులు బోడా రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజా కార్యక్రమం, యాగంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పాల్గొన్నారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు గద్దం ఆదినారాయణ, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, చింతపల్లి గోపిచంద్, పసుపులేటి శ్రీనివాసరావు, యాలటూరి రవి, జగదీష్‌తో పాటు లక్ష్మీ విజయ గణపతి కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులకు నెల్లూరు అర్బన్ కమిటీ ఆహ్వానం



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 17)
ఈ నెల 20న జరగబోయే ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకార మహోత్సవానికి కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులకు అధికారికంగా ఆహ్వానం లభించింది. నెల్లూరు నుండి కర్నూలుకు ప్రయాణిస్తున్న నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం మహిళా కమిటీ ప్రతినిధులు, మార్గమధ్యంలో బద్వేల్ పట్టణంలోని ఆర్యవైశ్య నాయకుల స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించే ప్రమాణస్వీకార కార్యక్రమానికి కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి సభ్యులు తప్పక హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. బద్వేల్‌కు విచ్చేసిన నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మునగ నాగేశ్వరరావు, మహిళా మండలి అధ్యక్షురాలు శేషాద్రి సువర్ణకుమారి, ఆర్యవైశ్య మహాసభ స్టేట్ మహిళా మండలి వైస్ ప్రెసిడెంట్ వాయిగండ్ల సుప్రియ, సెక్రెటరీ దేసు కల్పన, నెల్లూరు ఆర్యవైశ్య మహిళా మండలి వైస్ ప్రెసిడెంట్ మునగ వాణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పెసల శైల, తదితరులకు కడప జిల్లా నాయకులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వల్లంకొండు వెంకటరమణ, ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, మహిళా మండలి ట్రెజరర్ దేవతి లలిత, గౌరవ సలహాదారు వల్లంకొండు ధనలక్ష్మి, తదితరులు నెల్లూరు అర్బన్ కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. ఈ నెల 20వ తేదీన ప్రమాణ స్వీకారం చేయబోవు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం, నూతన కార్యవర్గ సభ్యులకు కడప జిల్లా తరపున వారికి అభినందనలు తెలిపారు.









ఘనంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ప్రారంభం

విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టంబర్ 17)
స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి నేతృత్వంలో, మున్సిపల్ కమిషనర్ పి. శ్రీధర్ పర్యవేక్షణలో గురువారం కనిగిరి పురపాలక సంఘం, మార్కాపురం జిల్లా ఘన వ్యర్థాల నిర్వహణ కమిటీ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు డ్రాయింగ్ పోటీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఈఓ సంజీవి తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ 'స్వచ్ఛతా మెయిన్ సహభాగ్, స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్' నినాదంతో ప్రజలు, ప్రభుత్వ శాఖలు, సంస్థలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ సహకారంతో కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కూటమి నాయకులు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, స్వచ్ఛతను నిత్యజీవితంలో ఒక భాగంగా మలచుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి పట్టణ టీడీపీ అధ్యక్షులు ఫిరోజ్,కూటమి నాయకులు, శానిటరీ సెక్రటరీలు, సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లా అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కండి

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టంబర్ 17)

మార్కాపురం జిల్లా అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విద్యార్థులను కోరారు. పట్టణంలోని సాధన జూనియర్ కాలేజీలో గురువారం "మార్కాపురం జిల్లా అభివృద్ధి కోసం – విద్యార్థులతో ముఖాముఖి" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాధన జూనియర్ కాలేజీకి విచ్చేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక విద్యార్థిని ఎమ్మెల్యేతో పండిన పంటలను నిల్వ చేయడానికి ఎటువంటి సదుపాయాలు కల్పిస్తారని ప్రశ్నించగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ఇప్పటికే మార్కాపురం జిల్లాను హార్టికల్చర్‌హబ్ గా ప్రకటించామని, దీంతో చాలా ఉపయోగాలు ఉన్నాయని, ముందుగా అన్ని గ్రామాల్లో పొలాల్లో తారు రోడ్డు సౌకర్యం ఏర్పాటు అవుతుందని తద్వారా రైతులు తమ ఉత్పత్తులను తరలించడానికి సులువుతుందన్నారు. పండ్ల మొక్కలను ప్రభుత్వం సబ్సిడీ చేస్తుందని, దీని ద్వారా రైతులకు వ్యయ ప్రయాసలు తగ్గుతాయని అన్నారు. హార్టికల్చర్ హబ్‌లో భాగంగా ఈ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజ్‌లు వస్తాయని, తద్వారా రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చన్నారు. హార్టికల్చర్ హబ్ ద్వారా ఈ ప్రాంతంలో జ్యూస్ ఫ్యాక్టరీలు వస్తాయని తద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఉపాధి కూడా లభిస్తుందన్నారు. మరొక విద్యార్థిని ఈ ప్రాంతంలో వైద్య సదుపాయాలు ఏ రకంగా మెరుగవుతాయని అడగగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలో ప్రజలు వైద్య సదుపాయాలు లేక ఇబ్బంది పడుతుంటే 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మార్కాపురం ఆసుపత్రిని జిల్లా హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేసి తీసుకువచ్చానని గుర్తు చేశారు. మార్కాపురం మెడికల్ కాలేజీ, హాస్పటల్ త్వరలోనే పూర్తి చేసి వచ్చే సంవత్సరంలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తానన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలు సుదీర్ఘ ప్రాంతాలకు వైద్య చికిత్సలు కోసం వెళ్లకుండా చేస్తానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే మార్కాపురం ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక జిల్లా సాధించామని, ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఇప్పటికే నల్లమల సాగర్‌ను నీటితో



నింపుతున్నామని, హార్టికల్చర్ హబ్ గా ఈ ప్రాంతం రూపాంతరం చెందబోతుందని, తీవ్ర త్రాగునీటి సమస్య ఉన్న ఈ ప్రాంతంలో త్వరలో ఇంటింటికి పైపులైన్ పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి త్రాగునీరు అందిస్తామన్నారు. దీంతో విద్యార్థులు తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాధన జూనియర్ కాలేజ్ సిబ్బంది, విద్యార్థులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అంగన్వాడీ సిబ్బందికి అవగాహన





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టంబర్ 17)

మండలంలోని నాగెళ్లముడుపు గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో గురువారం పౌష్టిక ఆహార మహోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి పద్మ పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సతుల్య ఆహారం అందించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి రోజూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు హనుమాంజలి, మాలకొండమ్మ, కుమారి, నజీమా, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

నేటి విత్తన బంతులే రేపటి మహావృక్షాలు ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ టి. సీతారామయ్య





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టంబర్ 17)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నేతృత్వంలో సామాజిక అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం కనిగిరి మండలం బల్లిపల్లి రెవెన్యూ కొండ పై ప్రజల భాగస్వామ్యంతో విత్తన బంతుల (సీడ్ బాల్స్) వెదజల్లే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదిలి ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ టి సీతారామయ్య మాట్లాడుతూ నేటి విత్తన బంతులే రేపటి మహావృక్షాలు" అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులకు విత్తన బంతుల తయారీ, వాటి ప్రయోజనాలు, పచ్చదనం పెంపొందించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొండ ప్రాంతంలో సీడ్ బాల్స్‌ను వెదజల్లారు.ఈ కార్యక్రమంలో ఎస్-ఎస్ఓ సక్రు నాయక్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, గ్రామ పెద్దలు, విద్యార్థులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో నేడు ప్రత్యేక పీజీఆర్ఎస్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ, ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, సెప్టంబర్ 17)

ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతో పర్చూరు నియోజకవర్గంలో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించిన 'ఒక నెల.. ఒక నియోజకవర్గం.. నాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మార్టూరులో ప్రత్యేక పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్ తెలిపారు. మార్టూరు మండలం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం కొనసాగనుంది. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించనున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, భూ సమస్యలు, సంక్షేమం, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రజలు తమ ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకురావచ్చు.

అధికారులంతా హాజరు కావాలి : నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ప్రత్యేక పీజీఆర్ఎస్‌కు పర్చూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని శాఖల మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి అందే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు ప్రత్యేక పీజీఆర్ఎస్ మంచి అవకాశమని తెలిపారు. మార్టూరు యద్దనపూడి మండలాలకు చెందిన ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, సమస్యల పరిష్కారానికి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామని, 'ఒక నెల.. ఒక నియోజకవర్గం.. నాలుగు పర్యటనలు'లో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రతి శుక్రవారం ప్రత్యేక పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పర్చూరు నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై అర్జీలు సమర్పించి పరిష్కారం పొందాలని కోరారు.

ఆన్‌లైన్‌లోనూ అర్జీలు : ఫిర్యాదుల స్థితిగతులు, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని అధికారులు తెలిపారు. అలాగే Meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా ప్రజలు తమ అర్జీలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

దీప ప్రజ్వలన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టంబర్ 17)

ప్రధాని నరేంద్ర దాస్ మోడీ పుట్టినరోజు సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని కందుకూరులో గురువారం సాయంత్రం ఘనంగా జరిపారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధానమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ కొవ్వొత్తులు వెలిగించి, దీప ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీ సారథ్యంలో దేశం అన్ని రంగాలలో దూసుకుపోతోందని అన్నారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారత్ అగ్రస్థానంలో ఉండడానికి మోదీయే కారణం అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ఆయన గొప్ప సహకారం అందిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా నేతలందరూ ప్రధానమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద జరిగిన కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, రూరల్ మాజీ అధ్యక్షుడు నార్నే రోశయ్య, నియోజకవర్గ అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు, పొడపాటి మహేష్, పార్టీ నేతలు రాయపాటి శ్రీనివాసరావు, గోచిపాతల మోషే, నాదెళ్ల రమణయ్య, తన్నీరు ఏడుకొండలు, గొంది నరసింగరావు, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.





అంగన్వాడి కేంద్రాల్లో తాజా వేడి భోజనం





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టంబర్ 16)

కనిగిరి సెక్టర్ పరిధిలోని పాతకూచిపూడిపల్లి అంగన్వాడి కేంద్రం నందు తొమ్మిదవ జాతీయ పోషణ మాసం 2026 సందర్భంగా మన అంగన్వాడీ-మన బాధ్యత అనే నినాదంతో కనిగిరి ప్రాజెక్టు ఆఫీసర్ పి సరోజినీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. మూడు నుంచి 6 సంవత్సరాల పిల్లలందరూ అంగన్వాడి కేంద్రానికి హాజరుకావాలని, అక్కడ అందించే పౌష్టికాహారము ప్రతి లబ్ధిదారులు అందుకోవాలని, అంగన్వాడీలో అప్పటికప్పుడు వేడివేడిగా భోజనం వండి అందించటం జరుగుతుందని, కాబట్టి కాన్వెంట్‌కు పంపించకుండా అంగన్వాడికి పంపించి ప్రీ స్కూల్ విద్యను నేర్చుకోవాలని తల్లిదండ్రులు బాధ్యత వహించాలని తెలియజేశారు. చిన్నపిల్లలు ఏడు నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు ఫోన్ ఇచ్చి ఆహారం పెట్టరాదని, సెల్ ఫోన్స్ పిల్లలకు ఇవ్వవద్దని తెలియజేశారు. ఏడు నుంచి మూడు సంవత్సరాలు పిల్లలకు పౌష్టికాహారం నాణ్యంగా ఇవ్వడం ద్వారా 85% మెదడు ఎదుగుతుందని తెలియజేశారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రతి తల్లి తండ్రి బాధ్యత వహించి విద్యను ప్రోత్సహించాలని తెలియజేశారు. గర్భిణీలు, బాలింతలు ఇంటికి ఇచ్చే రేషన్ ఎప్పటికప్పుడు వేడిగా వండుకొని తీసుకోవాలని తెలియజేశారు. ఈ విధంగా ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉంటామని, నవచేతన యాప్ ద్వారా పిల్లలకు ఉన్న అనారోగ్యాలను గుర్తించి వారిని హెల్త్ డిపార్ట్‌మెంట్ కి రిఫర్ చేయడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించడం జరిగినది. నలుగురికి శ్రీమంతాలు నిర్వహించటం జరిగిశీది. ఈ కార్యక్రమశీలో ఏఎన్ఎం షకీలా రాణి, స్థానిక నాయకుడు షేక్ బారాయిమామ్, అంగన్వాడి కార్యకర్తలు అనురాధ, రాధా, జయలక్ష్మి, రిజ్వాన ఆయాలు అంగన్వాడి సూపర్వైజర్ జి పద్మజ పాల్గొనడం జరిగినది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అవినాష్‌రెడ్డి దిశానిర్దేశం

పులివెందుల మున్సిపల్ ఎన్నికల అభ్యర్థిగా వైఎస్ మనోహర్ రెడ్డి







(షణ్ముఖ వెలుగు, పులివెందుల, సెప్టెంబర్ 17)

వైఎస్సార్ ఆడిటోరియంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పాల్గొని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పులివెందులను ఓసీకి కేటాయిస్తే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ మనోహర్ రెడ్డి బరిలో ఉంటారని ఎంపీ ప్రకటించారు. ఈ మేరకు వైఎస్ మనోహర్ రెడ్డిని అభ్యర్థిగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని వెల్లడించారు. ఒకవేళ రిజర్వేషన్ మారితే మనోహర్ రెడ్డి నేతృత్వంలో మరొక బలమైన అభ్యర్థి పోటీలో ఉంటారని తెలిపారు. ఇదే వేదిక పై 'వెన్నుపోటు పార్టీ.. వెన్నుపోటు పాలన' పేరిట రూపొందించిన మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం పై ఎంపీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పులివెందులలో చోటామోటా నాయకులకు ఏకంగా 25 మంది గన్‌మెన్లను ఇచ్చారని ఆరోపించారు. పోలీసులను, 'దండుపాళ్యం బ్యాచ్'లను నమ్ముకుని టీడీపీ ఎన్నికల్లో ప్రచారం చేయాలని చూస్తోందని విమర్శించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలపై ఒక్క దెబ్బ పడినా... తిరిగి నాలుగు దెబ్బలు పడతాయని హెచ్చరించారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ అవినాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణకు టీడీపీ కూడా సహకరించాలని సూచించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగితేనే ఎవరి సత్తా ఏమిటో స్పష్టంగా తేలుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

ఘనంగా వినాయకునికి పూజలు నిర్వహించిన వరికుంట్ల అనిల్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 17)

పట్టణంలోని ఓబులశెట్టి వారి వీధిలో రామాలయం గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని గురువారం పొదిలి నగర పంచాయతీ క్లస్టర్ ఇంచార్జ్ వరికుంట్ల అనిల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రోళ్ళ శ్రీను, మలిశెట్టి సందీప్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు వరికుంట్ల అనిల్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదాన సంతర్పణ చేసారు. అనిల్‌లో ఉన్న భక్తి భావం, సేవా గుణం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేవీ రమణారెడ్డికి అభినందనలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 17)

మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్సీపీ పరిశీలకులుగా నియమితులైన కేవీ రమణారెడ్డికి గురువారం తన కార్యాలయంలో పలువురు వైసీపీ యువ నాయకులు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. వైఎస్సార్సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రస్తుతం గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న కేవీ రమణారెడ్డి మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ మేరకు వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయం, తాడేపల్లి నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. రాబోయే రోజుల్లో పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, సంబంధిత రీజినల్ కో-ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ పార్టీని మరింత పటిష్టం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కేవీ రమణారెడ్డిని సత్కరించిన వారిలో బాపూజీరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, రమణారెడ్డి, గోలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామి, అమ్మవారి దర్శనం






(షణ్ముఖ వెలుగు, మార్కాపురం, సెప్టెంబర్ 17)

శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి, అమ్మవారిని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని స్వామి, అమ్మవారిని ప్రార్థించారు.





మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును మర్యాదపూర్వకంగా కలిసిన పొదిలి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భూమా రమేష్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 17)

పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమా రమేష్ ఎన్నికయ్యారు. ఈ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం నూతన అధ్యక్షుడు భూమా రమేష్, మార్కాపురం నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును మార్కాపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబును ఘనంగా సత్కరించి, శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. వైయస్ ఆర్సీపీ నాయకులుగా సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండే భూమా రమేష్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం పట్ల పార్టీ శ్రేణులు, ఆర్యవైశ్య ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు యక్కలి శేషగిరిరావు, కొత్తూరి శ్రీను తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటలు పండించాలి



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 17)

మండలంలోని పెద్ద వెంకన్నపాలెం గ్రామంలో గురువారం 26వ వేలంకేంద్రం బోర్డ్ నిర్వహణ అధికారి రైతులకు పొగాకు పై అవగాహన కల్పించారు. వేలం నిర్వహణ అధికారి బ్రిజ్జిభూషణ్ మాట్లాడుతూ నర్సరీ దశ నుంచి పంటలలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బోర్డు సూచించిన మేరకు పొగాకు ఉత్పత్తి చేయాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షం తక్కువగా ఉంటుంది కాబట్టి రైతులు ప్రత్యన్నాయ వంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ స్వామి, క్షేత్ర సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కంది విత్తనాలు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 17)

మండలంలోని కోటపాడు భోగనంపాడు చెన్నుపాడు గ్రామాల్లో వ్యవసాయ అధికారి వి రాము ఆధ్వర్యంలో గురువారం కంది విత్తనాలు పంపిణీ చేశారు. మండలానికి ఎల్ఆర్‌జి 52 రకం కంది విత్తనాలు 42 క్వింటాలు మంజూరైనట్లు రాము తెలిపారు. కంది విత్తనాలు పూర్తి ధర రూ 12050 కాగా ప్రభుత్వం రూ 9640 రాయితీ అందిస్తుందని, రైతు కేవలం రూ 2410 చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. కోటపాడు రైతు సేవా కేంద్రానికి 14 భోగనంపాడు చెన్నిపాడు కేంద్రాలకు పది చొప్పున, మాలపాడు కేంద్రానికి మూడు, ముండ్లమూరి వారి పాలెం కేంద్రానికి ఐదు గంటల చొప్పున మొత్తం 42 క్వింటాలు కేటాయించినట్లు రాము తెలిపారు. రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కంభంలో అంగరంగ వైభవంగా విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం



(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 17)

శ్రీశ్రీశ్రీ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం సందర్భంగా కంభంలో గురువారం భక్తిశ్రద్ధలతో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, మండపారాధన, పంచబ్రహ్మ కలశారాధన నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవంతో పాటు స్వామివారి బంగారు, వెండి విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ, మహా నివేదన, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మధ్యాహ్నం భక్తాదులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు విశ్వకర్మ భగవాన్ చిత్రపటంతో కంభం పురవీధుల్లో గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, ఎన్ వీరబ్రహ్మం, శంకర్, డి బ్రహ్మం, పూర్ణమల్లి అంజి, ఎం భాస్కర్, బుజ్జి, సిహెచ్ బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

షణ్ముఖ వెలుగు

ePaper
www.shanmukhavelugu.com

చీకటి గోపి లాకప్ డెత్‌లో తాడికొండ సీఐ, ఎస్ఐలను అరెస్టు చేయాలి

కాపులకు ఇచ్చినట్టే దళితులకు కూడా రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి
చౌదరి, నాయుడు హత్యకు గురైన పరామర్శించి
మాలా, మాదిగలు 25 మంది హత్యలు, లాకప్ డెత్ లకు గురైనా
స్పందించని దళిత హోంమంత్రి అనిత
గుంటూరు కలెక్టరేట్ వద్ద చీకటి గోపి మహాధర్నాలో దళిత నేత నీలం





(షణ్ముఖ వెలుగు, గుంటూరు, సెప్టెంబర్ 17)

తాడికొండ పోలీస్ స్టేషన్లో పోలీస్ వేధింపులకు గురై అక్రమంగా నిర్బంధించబడి లాకప్ డెత్ కు గురైన చీకటి గోపి కేసులో తాడికొండ సిఐ ఉమేష్ ఎస్సై జ్యోతి లను హత్యా ఎస్సీ ఎస్టీ నేరం కింద అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. గురువారం గుంటూరు కలెక్టరేట్ ముందు జరిగిన చీకటి గోపి పోలీస్ హత్యపై నిర్వహించిన మహాధర్నాలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సిపిఐ పార్టీ కార్యదర్శి వి సి కె పార్టీ రాష్ట్ర కార్యదర్శి విద్యాసాగర్ దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి కొరివి. వినయ్ కుమార్ తో కలిసి నీలం నాగేంద్రరావు మాట్లాడారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన చీకటి గోపి అను ఎస్సీ మాల కులానికి చెందిన యువకుడు చేయని నేరానికి తాడికొండ పోలీస్ స్టేషన్లో అక్రమంగా నిర్బంధించబడి పోలీస్ వేధింపులకు గురై ప్రాణాలు పోగొట్టుకున్నాడన్నారు. ఈ ఘటన సెప్టెంబర్ నెల ఒకటవ తేదీన జరగగా పోలీసులు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసి తాము తాడికొండ పోలీస్ స్టేషన్ ముందు మూడవ తేదీ ఆందోళన చేయగా మొక్కుబడిగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మేడికొండూరు సిఐ మల్లికార్జునరావును విచారణ అధికారిగా నియమించారన్నారు. తుళ్లూరు డిఎస్పి మురళీకృష్ణ గోపి ఒంటిమీద దెబ్బలు లేవని అనారోగ్యంతోనే చనిపోయాడని ఖాకీ కథ చెప్పి కూటమి ప్రభుత్వ కమలం పువ్వులు దళితుల చెవుల్లో పెట్టాడన్నారు. పోలీసు కస్టడీలో మరణించిన చీకటి గోపి కి చట్టపరమైన న్యాయం కోసం నిరంతర న్యాయ పోరాటం చేస్తామని హైకోర్టులో కూడా కేసు వేస్తామని నీలం నాగేంద్రరావు తెలిపారు. ఒంగోలులో సాటి కమ్మ కులస్తులే చంపిన ఘటనలో హడావుడిగా రాత్రికి రాత్రే ఒంగోలు వచ్చి వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించి మరుసటి రోజు కూడా ఉండి అంత్యక్రియలు అయ్యేవరకు ఉండి వీరయ్య చౌదరి భార్యను ఓదార్చిన అనిత సాటి మాదిగ కులస్తుడు విజయవాడలో క్రాంతి మాదిగ పోలీసు వేధింపులకు గురై బలవన్మరణం చెందితే మూడు నెలలైనా సెక్రటేరియట్ పక్కనే ఉన్న క్రాంతి మాదిగ కుటుంబాన్ని పరామర్శించలేదన్నారు. అలాగే గుడ్లూరు మండలంలో దారకానిపాడు గ్రామంలో లక్ష్మి నాయుడు అనే కాపు కులస్తుడుని తెలుగుదేశం పార్టీకి చెందిన వారు యాక్సిడెంట్ చేసి చంపితే





దళిత హోం మంత్రి అనిత పరుగున వెళ్లి సాటి కాపు మంత్రులతో కలిసి పరామర్శించిందన్నారు. కానీ రాజధాని ప్రాంతమైన తాడికొండ పోలీస్ స్టేషన్లో మాలకులానికి చెందిన చీకటి గోపి పోలీస్ చిత్రహింసలతో చనిపోతే కనీసం పత్రికా ప్రకటన కూడా చేయలేదన్నారు. గతంలో తెనాలిలో దళిత యువకులు ముగ్గురిని నడిరోడ్డుపై పోలీసులు లాఠీ లతో కొట్టి వీడియో వైరల్ చేసిన ఘటనను పోలీసులు కొడితే తప్పేముందని హోంమంత్రి సమర్థించ బట్టే రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లో దళితుల లాకప్ డెత్ లు పెరిగిపోతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వానికి కాపు కాస్తున్న కాపు కులస్తులు లక్ష్మీ నాయుడు హత్యకు గురైతే 8 ఎకరాల పొలం 20 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇచ్చినట్టే చీకటి గోపి కుటుంబానికి కూడా 20 లక్షలు ఎక్స్ గ్రేషియా 4 ఎకరాల భూమైన ఇవ్వాలని అలాగే చీకటి గోపీని చంపిన తాడికొండ సిఐ ఉమేష్, ఎస్ఐ జ్యోతి గ్యాంగ్ ను అరెస్టు చేయాలని నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, ఎరుకల హక్కుల సంఘం అధ్యక్షులు మోహన్ కుమార్ ధర్మ, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య కార్యదర్శి కాకుమాను రవి, మేడికొండ మురళి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా కాల్చాటంతో పది ఎకారుల సరికి తోట దగ్ధం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టెంబర్ 17)

మండలంలోని మోటుపల్లి పంచాయతీ నిరక్షిణగిరి గ్రామ సమీపంలోని రామచంద్రాపురం రోడ్డు దగ్గర పది ఎకరాల సరికి తోట నందు గురువారం మధ్యాహ్నం సమయంలో జరిగిన అగ్నిప్రమాదంలో పది ఎకారులు సరికి తోట కాలిపోయింది. వినాయక నిమజ్జనం సందర్భంగా మోటుపల్లి బిచ్ కు గణపతులను తరలించే సమయంలో భక్తులు బాణసంచా కాల్చటంతో సరికి తోటకు మంటలు అంటుకోని అగ్నిప్రమాదం జరిగింది. ఇ ప్రమాదంలో ఎదు ఎకారులు పక్షకంగా మూడు ఎకరాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమపక సిబ్బంది మంటలు అర్పాటంతో పేనుప్రమదం తప్పింది.

కుమ్మరిపాలెం, బద్దిపూడి అంగన్వాడి కేంద్రాలలో పోషణ మాసం కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 17)

మండలంలోని కరేడు సెక్టార్‌లోని ఆత్మకూరు పంచాయతీ కుమ్మరిపాలెం అంగన్వాడి కేంద్రం నందు సిడిపిఓ డి. మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సూపర్వైజర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం మొత్తం 5 థీమ్స్ గా ఉన్నవి. ప్రతివారం ఒక్కొక్క థీమ్ పైన కార్యక్రమం జరపాలి. అంగన్వాడి కేంద్రంలో తాజాగా వేడిగా భోజనం అనే అంశం పైన, అంగన్వాడీ కేంద్రంలో వారాంతర భోజన క్యాలెండర్ మరియు పోషణ విలువలు కలిగిన మునగాకుతో వంటలు 3 నుండి 6 సంవత్సరాల పిల్లలను కచ్చితంగా అంగన్వాడి కేంద్రాల్లో ఇచ్చే పోషక ఆహార విలువల గురించి ప్రతి ఒక్క తల్లి అవగాహన కలిగి ఉండాలి. అంతే కాకుండా అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈ అందుబాటులో ఉండి వారి అభివృద్ధి ఎంతో దోహదపడుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లులు, గర్భవతులు, బాలింతలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. అదేవిధంగా బద్దిపూడి పంచాయితీ బద్దిపూడి అంగన్వాడీ కేంద్రంలో కూడా సూపర్వైజర్ కె రమాదేవి ఆధ్వర్యంలో పోషణ మహా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జక్కి వెంకట కరుణాకర్ నియామకం



(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 17)

నూతన మార్కాపురం జిల్లాకు తొలి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జక్కి వెంకట కరుణాకర్ నియమితులయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన నూతన బాధ్యతలను స్వీకరించారు. తన పై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు జక్కి వెంకట కరుణాకర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర బీజేపీ ఓబీసీ అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్, మార్కాపురం జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేస్తూ, బీసీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. పార్టీ కోసం సైనికుడిలా పనిచేస్తూ, నాయకులు, కార్యకర్తల సహకారంతో మార్కాపురం జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నూతన జిల్లాకు తొలి ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం తనకు ఎంతో గర్వకారణమని కరుణాకర్ పేర్కొన్నారు.


చిల్లర మాటలు మాట్లాడొద్దు

సంస్కార హీనంగా ప్రవర్తిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు
వైసీపీ నేతలకు ఎమ్మెల్యే ఇంటూరి హెచ్చరిక
మా పనితనం చూసే.. స్థానిక ఎన్నికల్లో గెలిపిస్తారు
సోమశిల నుంచి త్వరలో రాళ్లపాడుకు నీటి విడుదల
వెలిగొండ నుంచి కందుకూరు ప్రాంతానికి తాగు, సాగునీరు
పోర్టు దగ్గర 1500 ఎకరాల్లో పెట్రో కెమికల్ పార్క్
మీడియా సమావేశంలో వెల్లడించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 17)

తనపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తీవ్ర స్థాయిలో స్పందించారు. గురువారం కందుకూరులోని టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేతలవి చిల్లర మాటలు. పందికి తెల్లచొక్కా వేసినా, అది మళ్ళీ బురదలోకే వెళుతుంది. రాజకీయంగా ఉన్నత స్థాయికి వెళ్లినా కొందరు వైసీపీ నేతల వ్యవహారం సంస్కారహీనంగా ఉంది. నేను సర్పంచ్ స్థాయి నుంచి వచ్చాను. వారి దగ్గర నుంచి రాజకీయం నేర్చుకోవాల్సిన అవసరం నాకులేదు. మాలకొండ, టీటీడీ సిఫార్సులు లాంటి విషయాల పై అబద్ధాలు మాట్లాడడానికి వైసీపీ నేతలకి సిగ్గుండాలి. నేను చిత్తశుద్ధితో పనిచేస్తుంటే ప్రతిరోజూ రాళ్లు వేయడమేనా? 2019-24 మధ్య అభివృద్ధి గురించి మీరు పట్టించుకున్నారా ? నా హయాంలో జరిగిన పనులు మీ కళ్ళముందే కనిపిస్తున్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా ఐదేళ్లలో మీరు 20 కిలోమీటర్లు రోడ్లు వేస్తే ఈ రెండున్నర ఏళ్లలో రూ.81 కోట్లతో 90 కిలోమీటర్ల దూరం కొత్తగా రోడ్లు వేసిన చరిత్ర మాది అని అన్నారు. కందుకూరు మున్సిపాలిటీకి జగన్ రూ.23 కోట్లు ఇచ్చారా? ఎప్పుడు ఇచ్చారో చూపించండి. అలా అబద్ధాలు చెప్పటానికి మీకు సిగ్గనిపించడం లేదా? ఎంఐజి లేఅవుట్ ద్వారా వచ్చిన సొమ్ములో ఒక్క రూపాయి అయినా మున్సిపాలిటీకి ఖర్చు పెట్టారా ? లేఅవుట్ భూములు 22ఏ లో ఉంటే, అది క్లియర్ చేయకుండా ప్లాట్లు వేసి, బలవంతంగా అంటగట్టింది మీరే కదా? 1800 ఎకరాల గర్భకండ్రిక భూములు, ఎంఐజీ లేఅవుట్, నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీ భూములను 22ఏలో నుంచి మీరు ఎందుకు తొలగించలేదు? ఏళ్ల తరబడి జనం ఇబ్బందులు పడుతుంటే మీకు కనిపించలేదా? కూటమి ప్రభుత్వంలో అవన్నీ నేనే క్లియర్



చేయించాను. ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తుంటే వైసిపి నేతలు ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని బలవంతంగా నెల్లూరులో కలిపినప్పుడు వీళ్లంతా ఎటు వెళ్లారు? గొంతులు మూగబోయాయా? ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి, కూటమి ప్రభుత్వం రాగానే తిరిగి ప్రకాశంలో కలిపాం. అదీ మా చిత్తశుద్ధి. సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు తీసుకురావడంలో రాష్ట్రంలో కందుకూరు 34వ ర్యాంకులో ఉంది. ఇప్పటికీ 43 విడతల్లో 1655 మందికి రూ.12.6 కోట్లు అందించడం జరిగింది. వైసీపీ ప్రభుత్వంలో ఇంత పెద్ద మొత్తంలో పేదలకు లబ్ధి చేకూరిందా ? ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక, రాళ్లపాడు ప్రాజెక్టులో నీళ్లు తగ్గాయి. తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా సోమశిల నుంచి నీటిని విడుదల చేయాలని ముఖ్యమంత్రిని అడిగితే ఆయన ఓకే అన్నారు. త్వరలోనే ప్రాజెక్టుకు నీళ్లు వస్తాయి. వెలిగొండ ప్రాజెక్టు నుంచి గ్రావిటీ ద్వారా కనిగిరి వరకు వచ్చే నీటిని కందుకూరు నియోజకవర్గం వరకు తీసుకురావాలని సీఎంకి విన్నవించడం జరిగింది. ముందుగా తాగునీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత సాగునీటిని కూడా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు. రామాయపట్నం పోర్టు దగ్గర 1500 ఎకరాలలో పెట్రో కెమికల్ పార్కు ఏర్పాటు కాబోతోంది. త్వరలో పనులు మొదలవుతాయి. ఉపాధి ఉద్యోగ అవకాశాలు భారీగా లభిస్తాయి. రెండున్నర ఏళ్లలో నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయి. అవన్నీ ప్రజలకు వివరించి, వారి అభిమానంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుచుకుంటాం. విజయం కూటమి ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర ముస్లింమైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి శ్రీ వాత్సల్యకు చిరు సత్కారం







(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 17)

పొదిలి పట్టణంలోని రాములవారి గుడి వద్ద ఏర్పాటు చేసిన మహాగణపతి మండపం వద్ద గురువారం రాత్రి చిన్నారి శ్రీ వాత్సల్య చేసిన భరతనాట్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. చిన్న వయసులోనే అనేక చోట్ల ప్రదర్శనలు ఇస్తున్న చిన్నారి వాత్సల్య వినాయక చవితి పర్వదినం సందర్భంగా గత ఏడాది కూడా ఈ మండపం వద్ద నృత్య ప్రదర్శన ఇచ్చింది... వృత్తి ప్రదర్శన అనంతరం చిన్నారిని గణేష్ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి బహుమతి అందజేయడం జరిగింది.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నాగెళ్లముడుపులో ఉచిత వైద్య శిబిరం



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టెంబర్ 17)
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాగెళ్లముడుపు గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ డి హరీష్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 117 మందికి ఓపీ సేవలు అందించారు. జ్వరపీడితులకు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి మంత్రునాయక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కర్రా పాములు, హెల్త్ విజిటర్ ఎ నాగేశ్వరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఎ దివ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు

గాండ్ల సంక్షేమ సంఘ నాయకులు చిట్టెంశెట్టి కృష్ణారావు, దాసరి గురుస్వామి







(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 17)
పొదిలి పట్టణంలోని ఎన్జీవోహోం లో భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు ఆంధ్రప్రదేశ్ అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, పద్దులు యూనిట్ అధ్యక్షులు, మానవతా సేవ కార్యదర్శి చిట్టెంశెట్టిశెట్టి వెంకట కృష్ణారావు, దాసరి గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నరేంద్ర మోడీ చిత్రపటం ఆవిష్కరించి భారీ కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి మహిళలు ఆశీర్వాద దీపాలు అఖండ జ్యోతి వెలిగించి భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మహిళలు ఆకాంక్షించారు. తదుపరి ఏర్పాటు చేసిన సమావేశం నందు వెంకట కృష్ణారావు, దాసరి గురుస్వామి మాట్లాడుతూ యావత్ భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలు గర్వించదగిన, అవినీతి ఎరుగని గొప్ప వ్యక్తి నరేంద్ర మోడీ అని కొనియాడారు. మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత శత్రు దేశాలు భారతదేశం వైపు కన్నెత్తి చూడడానికి కూడా జంకుతున్నారని తెలియజేశారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ అవినీతి తెలియని మహా మనిషి, నిరంతర కృషీవలుడు నరేంద్ర మోడీ అని, మోడీ అంటేనే అఖండమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి వైరుకుంట్ల వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు చిట్టెం పెద్ద సుబ్బారావు, బిజెపి నేత శ్రీనివాసులు, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్స్ ప్రకాశం, మార్కాపురం జిల్లాల కన్వీనర్ నలబోలు కోటేశ్వరరావు, బట్టు పిచ్చయ్య, ఏరువ వెంకటరామయ్య, గుంటిక కృష్ణ, యూత్ కన్వీనర్ అనూష కోటేశ్వరి, లక్ష్మి, అనూష, చంద్ర, పలువురు గాండ్ల సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా మట్టి వినాయకుడి నిమజ్జనం

నిమజ్జనంలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు కుటుంబ సభ్యులు
రూ.1,56,000కి లడ్డు పాట పాడిన రావుల పద్మజ















(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 17)
ఒంగోలు నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని గురువారం నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌రావు సతీమణి నాగసత్యలత, కుమార్తెలు అనీషా లక్ష్మీ, తనూజ లక్ష్మీతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో భాగంగా వినాయకుడికి పూజలు నిర్వహించిన అనంతరం లడ్డూ వేలంపాటను నిర్వహించారు. లడ్డూ కోసం నిర్వహించిన వేలంపాటలో రావుల పద్మజ రూ.1,56,000కు లడ్డూను దక్కించుకున్నారు. అదే విధంగా వినాయకుడి మెడలో పూజలు అందుకున్న ఐదు దండలకు నిర్వహించిన వేలంపాటలో గోరంట్ల అనురాధ రూ.28,000, రాచగర్ల వెంకట్రావు రూ.22,000, పసుపులేటి సునీత రూ.28,000, కామరాజుగడ్డ కుసుమకుమారి రూ.30,000, వెంకటరమణమ్మ రూ.20,000లకు దండలను దక్కించుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మట్టి వినాయకుడికి వీడ్కోలు పలికి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలంపాటలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యాలయ ప్రాంగణం లో కొత్తపట్నం కోలాట బృందం అలరించింది, భక్తులతో సందడిగా మారింది.

బతుకుపోరులో బిడ్డ ఊపిరి కోసం అల్లాడిన అమ్మానాన్న

కంటి"పాపకు" ఆసరాగా నిలిచిన "సాంబన్న" హస్తం
సీఎంఆర్ ద్వారా రూ.3,54,127 భరోసా
వినూత్న కార్యక్రమానికి ఎమ్మెల్యే ఏలూరి శ్రీకారం
బాధితుల ఇంటి వద్దకే ఎల్ఓసి చెక్కులు
నేతలకు ఎమ్మెల్యే ఏలూరి కీలక ఆదేశాలు



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, సెప్టెంబర్ 17)
కూలి పని చేస్తేనే పూట గడిచే ఇల్లు.. కడుపు నింపుకోవడమే కష్టమైన బతుకులో కొత్త ప్రాణం పురుడు పోసుకుంది. కానీ ఆ చిట్టితల్లి బరువు తక్కువగా పుట్టడంతో, పురిటి నొప్పుల కంటే ముందు తల్లిదండ్రుల గుండెల్లో మరో యుద్ధం మొదలైంది. బిడ్డను బతికించుకోవాలంటే వైద్యం కావాలి.. వైద్యం కావాలంటే డబ్బు కావాలి.. కానీ రోజు కూలీయే జీవనాధారమైన ఆ నిరుపేద దంపతులకు అంత మొత్తం ఎక్కడి నుంచి తేవాలో అర్థం కాలేదు. కళ్లెదుటే బిడ్డ ప్రాణం గాల్లో దీపంలా ఊగిసలాడుతుంటే, ఆ అమ్మానాన్న కళ్లలో నీళ్లు తప్ప దారే కనిపించలేదు. చివరకు వారి ఆవేదనను తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి స్థానిక నేతల ద్వారా సీఎంఆర్ఎఫ్ మంజూరుకు ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. తక్షణమే తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రతినిధులను సీఎం ఓకి పంపారు. ఆగమేఘాల మీద ఎల్ఓసి మంజూరి చేయించి ఎమ్మెల్యే ఏలూరి ఆ కుటుంబానికి ఆపద్బాంధవుడిలా అండగా నిలిచి, ఆ చిన్నారి ప్రాణాలకు భరోసా ఇచ్చారు.

బతుకుపోరులో బిడ్డ కోసం పోరాటం : పర్చూరు మండలం, పర్చూరు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ వలి, షేక్ నన్నే దంపతులు రోజువారీ కూలి పనులు చేసుకుంటూ నెట్టుకొస్తున్న నిరుపేద కుటుంబం. వారం రోజుల క్రితం వీరికి ఆడ శిశువు జన్మించింది. ఆ కుటుంబంలో పాప జన్మించడంతో సంతోషం వెల్లివిరియాల్సిన వేళ, పాప తక్కువ బరువుతో పుట్టడంతో ఆ ఆనందం ఆందోళనగా మారింది. చిన్నారికి తక్షణమే ఇంక్యుబేటర్‌లో ఉంచి ప్రత్యేక చికిత్స అందించాలని వైద్యులు స్పష్టం చేశారు. అప్పటికే రోజు కూలిపైనే ఆధారపడి బతుకుతున్న మస్తాన్ వలికి, లక్షల్లో అయ్యే చికిత్స ఖర్చు తలచుకుంటేనే గుండె జారిపోయింది.

దిక్కుతోచని వేళ.. ఆసరాగా ఎమ్మెల్యే : ఎటు తిరిగినా దారి కనిపించని స్థితిలో, ఆ దంపతులు తమ గోడు వెళ్లబోసుకునేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వద్దకు చేరుకున్నారు. బాధిత తల్లిదండ్రుల కళ్లలో కదలాడిన ఆవేదనను గమనించిన ఎమ్మెల్యే, వెంటనే విషయం ఆరా తీసి వైద్యులతో మాట్లాడారు. ఏమాత్రం జాప్యం చేయకుండా తన క్యాంపు కార్యాలయ సిబ్బందిని ఆదేశించి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎల్ఓసీ మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టారు.

రూ.3,54,127తో ప్రాణాలకు భరోసా: ఎమ్మెల్యే ఏలూరి చొరవతో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి చిలకలూరిపేటలోని వరలక్ష్మి ఫెర్టిలిటీ అండ్ మెటర్నిటీ హాస్పిటల్‌లో చిన్నారి చికిత్స నిమిత్తం రూ.3,54,127 మేర ఎల్ఓసీ మంజూరైంది.

ఇంటివద్దకే చెక్కుతో వచ్చి ధైర్యం చెప్పిన నేతలు : ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు నేరుగా బాధితుని ఇంటికి చేరుకుని చెక్కును అందజేశారు. లక్షల్లో వచ్చిన ఆ సాయాన్ని చూసి కంటతడి పెట్టిన మస్తాన్ వలి దంపతులు, ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలిపారు. తమ చిన్నారికి ఇక సరైన వైద్యం అందుతుందన్న ధీమా వారి మోముల్లో ప్రస్ఫుటంగా కనిపించింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొల్లా శ్రీనివాసరావు, మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షంషుద్దీన్, ప్రధాన కార్యదర్శి నరేంద్ర, పర్చూరు పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మెడికల్ క్యాంపు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 17)
టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కందుకూరు నందు ఈరోజు ఆయుర్వేదిక్ మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు చెందిన ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ లక్ష్మీ కుమారి ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు, చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సౌకర్యం, సలహాలు కల్పించడంతో పాటు ఉచితంగా అనేక రకాల జబ్బులకి మందులు అందజేయడం జరిగింది. కళాశాల విద్యార్థిని విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారం పట్ల అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవి కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఎన్‌వి శ్రీహరి, డాక్టర్ ఎన్ తిరుపతిస్వామి, డాక్టర్ సిహెచ్ సురేష్ కుమార్, కరుణ రత్నకుమార్, డాక్టర్ డి మోషే, ఎన్‌డి ఖాదర్ భాషా, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో చురుగ్గా పాల్గొని విజయవంతం చేశారు.

అన్నా రాంబాబుకి లడ్డు ప్రసాదం అందజేత



(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 17)
పొదిలి పట్టణంలో రూ.37 వేలతో కైవసం చేసుకున్న వినాయకుడి లడ్డూను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు మందగిరి రమేష్ యాదవ్ గురువారం మార్కాపురంలోని ఆయన నివాసంలో అందజేశారు . పొదిలి పట్టణంలోని 5వ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పట్టణ అధ్యక్షుడు మందగిరి రమేష్ యాదవ్ రూ.37 వేలతో లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు అన్నా రాంబాబు భారీ మెజార్టీతో విజయం సాధించి, శాసనసభలో అడుగుపెట్టి మంత్రి పదవి చేపట్టాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు రమేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, ముల్లా షాహిద్, తదితరులు పాల్గొన్నారు.

భారత ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు



ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 17)
దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న దూరదృష్టి గల నాయకుడు, కోట్లాది భారతీయులకు స్ఫూర్తినిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. పుట్టినరోజు సందర్భంగా ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయం నందు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పార్టీ నాయకులతో కలిసి కొవ్వుత్తులు వెలిగించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదిక పై తన ప్రత్యేక గుర్తింపును చాటుకుంటోంది. 'సబ్కా సాథ్-సబ్కా వికాస్-సబ్కా విశ్వాస్' అనే స్ఫూర్తితో దేశంలోని ప్రతి వర్గం అభివృద్ధి కోసం మీరు చేస్తున్న కృషి అభినందనీయం అని తెలియజేసారు. మీకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, విజయాలతో నిండిన సంపూర్ణ జీవితం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. భారతదేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రపంచంలో మరింత ఉన్నత స్థానానికి చేర్చాలని ఆకాంక్షిస్తున్నాను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.